బల ప్రదర్శన చూపిస్తే

# టికెట్ కట్

## పనిచేసిన వారికే ఛాన్స్

## మున్సిపాలిటీలో ఎవరి ఇల్లు కూల్చం

## ఎవరైనా డబ్బులు అడిగితే నన్ను ప్రశ్నించండి

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, జనవరి 18, ప్రభాతవార్త :** మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి ఎలాంటి రాజకీయాలకు ఆస్కారం ఇవ్వమని, నిజాయితీతో గెలుస్తామని, సత్తా చాటుతామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్ నగర్ మీడియా ప్రతినిధులతో.. ఎన్నికల విషయంలో మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెపుతూ టికెట్ల కేటాయింపు విషయంలో బల ప్రదర్శన చేసే నాయకుల కన్నా, వార్డులో ఉండి నిరంతరం పనిచేసే వారికే ప్రాధాన్యతను ఇస్తామని వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ పీఠం ఈసారి కచ్చితంగా కాంగ్రెస్ పార్టీదేనని ఆయన స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో నమ్మి అధికార పీఠాన్ని ఇచ్చిన వార్డుల అభివృద్ధికి బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదని, అధికారంలోకి వచ్చిన రెండేళ్ల లోనే తాము ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. ఈ విషయం వార్డుల్లో ఉండే ప్రజలందరికీ తెలుసు అని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు కచ్చితంగా తమవైపే ఉంటారని ఆయన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఎవరైనా డబ్బులు అడిగితే నన్ను ప్రశ్నించండి మున్సిపాలిటీలో ఎవరైనా ప్రజల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తే వారు ఎంతటి వారి అయిన తన దృష్టికి తీసుకురావాలని తనను ప్రశ్నించాలని అలాంటి వాటికి తాను దూరమని ఎమ్మెల్యే

మిగతా 2లో



# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

## గతం కంటే ఈ ఎన్నికలు మరీ కాస్ట్‌లీ

## చైర్మన్ అభ్యర్థుల ఖర్చులు తడిసి మోపెడవుతాయని అంచనా

## కౌన్సిలర్‌గా గెలిచేందుకు రూ.అర కోటి?

## ఒక్కో వార్డుకు కనీసం రూ.5 లక్షలు

## మెజార్టీ రాకపోతే భారీ ఎత్తున కొనుగోళ్లకూ సై

## తాండూరు చైర్మన్ అభ్యర్థికి రూ.4 కోట్ల వరకూ ఖర్చు తప్పదని అంచనా

## వికారాబాద్‌లోనూ కనీసం 2 కోట్లు



# తులాభారం

## చైర్మన్ అభ్యర్థులను ముందస్తుగా ఖరారు చేయాలా, వద్దా?

## అలా చేస్తే ఫలితాలు అనుకూలమా .. ప్రతికూలమా?

## రాజకీయ పార్టీల మల్లగుల్లాలు

## శరవేగంగా వార్డు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ

## చైర్మన్ అభ్యర్థుల గురించి అంతా గుంభనం

## నోటిఫికేషన్ తర్వాతే ఖరారు ?

**(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)** మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల గురించి రాజకీయ పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. వారి పేర్లు ముందస్తుగా ఖరారు చేయాలా, వద్దా అనే మీమాంసలో ఉన్నాయి. ఒకవేళ చైర్మన్ అభ్యర్థులను ముందస్తుగా ప్రకటిస్తే ఫలితాలు అనుకూలంగా ఉంటాయా, ప్రతికూలంగా ఉంటాయానే కోణంలో ఆలోచిస్తున్నారు. రిజర్వేషన్లు ఖరారు చేసి ఒకరోజు గడిచినా ఇప్పటి వరకు ఏ అధిష్ఠానం కూడా అధికారిక ప్రకటన చేయలేదు. దాన్నిబట్టి చూస్తుంటే నోటిఫికేషన్ తర్వాత టిక్కెట్ల పంపకాలు, చైర్మన్ అభ్యర్థిపేర్ల ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయి. ఒక్కోసారి పోలింగ్ పూర్తయిన తర్వాత ప్రకటన చేయవచ్చు. ఇదంతా ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల నిర్ణయాలపైనే చైర్మన్ అభ్యర్థుల పేర్లు వెలుగులోకి వస్తాయి.

**పైసాతోనే పవర్..**

గడచిన ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి మరీ కాస్ట్‌లీగా ఉండవచ్చని భావిస్తున్నారు. డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తుందని అంటున్నారు. అభ్యర్థుల క్యారెక్టర్ కన్నా తులాభారం వైపే మొగ్గు చూపుతున్నారని సమాచారం. కొద్ది రోజులుగా వార్డు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సాగుతున్నా చైర్మన్ అభ్యర్థుల గురించి ఎలాంటి ఊసెత్తడం లేదు. వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్ వంటి బిగ్‌షాట్‌లు ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నందున మున్సిపల్ ఎన్నికలపై ఎక్కువగా ఫోకస్ పెట్టారు. వారి కనుసన్నలలోనే చైర్మన్ సీటు వరిస్తుంది. తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీల్లో చైర్మన్ అభ్యర్థుల ఖర్చులు తడిసి మోపెడవుతాయని భావిస్తున్నారు. ముందు కౌన్సిలర్‌గా వారు గెలిచేందుకు అనధికారికంగా రూ.అర కోటి మేరకు ఖర్చు చేయాల్సి వస్తుందని లెక్కలు కడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వు అయిన వార్డులలో కాస్త తక్కువ వ్యయం అవుతుందని అంటున్నారు. అంతే కాకుండా వార్డులో తమ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కూడా ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఒక్కో వార్డుకు కనీసం 5 లక్షల రూపాయల వరకు చైర్మన్ అభ్యర్థి భరించాల్సి ఉంటుందని చర్చ జరుగుతోంది. తాండూరులో 36 వార్డులు, వికారాబాద్‌లో 34 వార్డులు ఉన్నాయి. ఫలితాల తర్వాత ఆయా పార్టీలకు తగినంత మెజారిటీ సభ్యులు ఎన్నిక కానట్లయితే ఇతర పార్టీల అభ్యర్థుల కోసం వేట మొదలు పెడుతుంటారు. ఈ క్రమంలో భారీ ఎత్తున కొనుగోళ్లు చేయడం రాజకీయ నేతలకు కొత్తేమీ కాదని అంటున్నారు. తాండూరు వంటి మున్సి పాలిటీల్లో చైర్మన్ సీటుపై కూర్చునే అభ్యర్థికి కనీసం రూ.4 కోట్ల వరకు అనధికారికంగా పంచి పెట్టాల్సి వస్తుందని లెక్కలు కడుతున్నారు. వికారా బాద్‌లోనూ కనీసం 2 కోట్ల వరకు ఖర్చవుతుందని అంటు న్నారు. కొడంగల్, పరిగిలో తక్కువ వార్డులు ఉన్నందున ఖర్చు పెద్దగా కాకపోవచ్చని భావిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఈసారి ఖర్చులు రెట్టింపుస్థాయిలో చేసేందుకు అభ్యర్థులు ముందుకు వస్తు న్నారని తెలిసింది.

**రిజర్వేషన్ల తర్వాత ఆశావహులు ఇలా..**

**మున్సిపాలిటీ : తాండూరు**
రిజర్వేషన్ : బిసి జనరల్
కాంగ్రెస్ : పి.బాల్‌రెడ్డి, పి.నీరజ, పి.నర్సింహులు, అబ్దుల్ రవూఫ్
బిఆర్ఎస్ : పటేల్ నర్సింహులు
బిజెపి : యు.రమేష్, నరేందర్‌గౌడ్, సింధుజ

**మున్సిపాలిటీ : కొడంగల్**
రిజర్వేషన్ : జనరల్
కాంగ్రెస్ : మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తనయుడు, సిట్టింగ్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నందారం వెంకటయ్య మనవడు నందారం ప్రశాంత్ గుప్తా
బిఆర్ఎస్ : ఇంకా ఎవరి పేర్లు తెరపైకి రాలేదు
బిజెపి : ఇంకా ఎవరి పేర్లు తెరపైకి రాలేదు.
కొసమెరుపు : సిఎం రేవంత్‌రెడ్డి తలచుకుంటే ఏకగ్రీవం అయ్యే అవకాశాలు

**మున్సిపాలిటీ : వికారాబాద్**
రిజర్వేషన్ : ఎస్‌సి మహిళ
కాంగ్రెస్ : స్పీకర్ ప్రసాద్‌కుమార్ కుమార్తె అనన్య, మాజీ మంత్రి చంద్రశేఖర్ కుమార్తె చంద్రప్రియ
బిఆర్ఎస్ : మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్ సతీమణి
బిజెపి : ఇంకా అభ్యర్థుల పేర్లు చర్చకు రావడం లేదు.

**మున్సిపాలిటీ : పరిగి**
రిజర్వేషన్ : బిసి మహిళ
కాంగ్రెస్ : ఆర్‌టిసి సంఘం మాజీ నేత హన్మంత్ కుటుంబీకులు, లాల్‌కృష్ణ కుటుంబీకులు
బిఆర్ఎస్ : మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డిదే తుది నిర్ణయం
బిజెపి : ఇంకా చర్చకు రాలేదు.





# అంతర్గత సంక్షోభం

## ఆధిపత్య పోరుతో కల్వకుర్తి బిఆర్ఎస్ సతమతం



## ఇన్‌చార్జి బాధ్యతల్లో అంతంతమాత్రంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

## కార్యకర్తలకు దూరంగా ఉంటున్నారన్న విమర్శలు

## తలకొండపల్లి నుంచి నియోజకవర్గ స్థాయికి ఎగబాకిన ఉప్పల వెంకటేష్

## స్వచ్ఛంద సేవలతోపాటు పార్టీలో క్రియాశీలకంగా చురుకైన పాత్ర

## పంచాయతీ ఎన్నికలలో బిఆర్ఎస్ పట్టు నిలపడంలో సక్సెస్

## నియోజవర్గ నాయకత్వ మార్పు జరుగుతుందని పార్టీలో ప్రచారం

## తన ప్రమేయం లేకుండా పార్టీలో నిర్ణయాలు తీసుకుంటున్నారని వెంకటేష్‌పై జైపాల్‌యాదవ్ పరోక్ష విమర్శలు

## పార్టీకి దూరంగా ఉంటూ ఆరోపణలు చేయడం తగదని వెంకటేష్ ఎదురుదాడి

## పార్టీలో అంతర్గత పోరుపై కార్యకర్తల ఆందోళన

## మున్సిపల్ ఎన్నికల వేళ పార్టీకి చేటు వస్తుందని హితవు

## అధిష్ఠానం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

**రంగారెడ్డి అర్బన్, జనవరి 18, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ అంతర్గత సంక్షోభం ఎదుర్కొంటోంది. ఆ పార్టీ నుంచి మూడుసార్లు విజయం సాధించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పార్టీని నడిపించడంలో చురుగ్గా ఉండటంలేదన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. 1999, 2009, 2018 ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేసిన ఆయన 2023 ఎన్నికలలో ఘోర పరాజయాన్ని చవిచూశారు. ఆ తర్వాత నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అయితే ఆయన హైదరాబాద్‌కే పరిమితమై.. నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారని, అధిష్ఠానం పిలుపునిచ్చిన పార్టీ కార్యాక్రమాల వరకూ పాల్గొనటం మినహా కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలవలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపించాయి. మరోవైపు తలకొండపల్లి మండలానికి చెందిన బిఆర్ఎస్ నేత ఉప్పల వెంకటేష్ పార్టీలో కీలంగా వ్యవహరిస్తూ ఇటు, కార్యకర్తలకు దగ్గరవడంతోపాటు అధిష్టానాన్ని కూడా ఆకర్షించారు. గత జిల్లా పరిషత్ ఎన్నికలలో తాను జడ్‌పిటిసిగా గెలవడంతోపాటు తన వర్గానికి చెందిన పలువురిని ఎంపిటిసిలుగా గెలిపించటంలో కీలక పాత్ర పోషించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో సైతం ఆయన తలకొండపల్లి మండలంలో దాదాపు 18 మంది సర్పంచ్‌లను గెలిపించి మండలంలో బిఆర్ఎస్ పట్టు నిలిచేలా కృషి చేశారు. దీంతోపాటు ఆయన తలకొండపల్లి మండలానికే పరిమితం కాకుండా నియోజకర్గంలోని కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్, తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల తదితర ప్రాంతాల్లో కూడా పేదలకు స్వచ్ఛంద సేవా కార్యకర్యక్రమాలు చేస్తూ.. పార్టీ క్యాడర్‌కు దగ్గరై తనదైన ముద్ర వేసుకుంటున్నారు.

రానున్న అన్ని ఎన్నికల్లోనూ కార్యకర్తలకు సమర్థవంతమైన నాయకత్వం అవసరమని భావించిన అదిష్టానం.. కల్వకుర్తి నియోజకవర్గ పార్టీ నాయకత్వ మార్పు అంశాన్ని పరిశీలిస్తోందన్న ప్రచారం జరిగింది. ఈ ప్రచారాన్ని జీర్ణించుకోలేని జైపాల్ యాదవ్ ఇటీవల ఉప్పల వెంకటేష్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించటంతో పార్టీలో కలహాల కుంపటి రాజుకుంది. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తన ప్రమేయం లేకుండానే పార్టీలో నిర్ణయాలు జరుగుతున్నాయని, పంచాయతీ ఎన్నికలలో ఈ విషయం ప్రత్యేకంగ స్పష్టమైందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీలో ఆధిపత్యం కోసం కొంతమది ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఉప్పల వెంకటేష్ ఘాటుగానే ప్రతిస్పందించారు. ఎన్నికల సమయంలో పార్టీకి దూరంగా ఉండి, ఇప్పుడు విమర్శలు చేయడం సమంజసం కాదని, ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల సమయంలో పార్టీ బాధ్యతలను తానే ముందుండి చూసుకున్నానని, గ్రామస్థాయి కార్యకర్తలతో సమన్వయం చేసి పార్టీ ప్రతిష్టను నిలబెట్టానని వెంకటేష్ బహిరంగంగా వ్యాఖ్యానించటంతో పార్టీలో దుమారం రేగింది.

జైపాల్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు ప్రత్యక్షంగా పేరు ప్రస్తావించకపోయినా వెంకటేష్‌ను లక్ష్యంగా చేసుకుని మాట్లాడారని ఉప్పల వర్గం తీవ్రంగా మండిపడుతోంది.

మరోవైపు ఉప్పల వెంకటేష్ సోషల్ మీడియా వేదికగా చేసిన వరుస పోస్టులు ఈ వివాదాన్ని మరింత ప్రజల మధ్యకు తీసుకువచ్చాయి. అంతర్గతంగా పరిష్కరించుకోవాల్సిన విభేదాలు రచ్చకెక్కడంతో పార్టీ వర్గాలు తలలుపట్టుకుంటున్నాయి. ఒకప్పుడు సమావేశాలకే పరిమితమైన విభేదాలు, ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా కార్యకర్తల మధ్య చీలికను పెంచుతున్నాయి. వీరి మధ్య కోల్డ్ వార్ ప్రభావం కల్వకుర్తి, ఆమనగల్ మున్సిపాలిటీల్లో స్పష్టంగా కనిపిస్తోంది. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎవరి మాట వినాలన్న దానిపై అయోమయంలో ఉన్నారు. ఒక వర్గం జైపాల్ యాదవ్ అనుభవాన్ని ప్రస్తావిస్తే, మరో వర్గం ఉప్పల వెంకటేష్ ప్రస్తుత క్రియాశీలతే పార్టీకి బలమని వాదిస్తోంది.

నియోజకవర్గంలో కల్వకుర్తి, ఆమనగల్లు మునిసిపాలిటీలు ఉన్నాయి. గత ఎన్నికలలో కల్వకుర్తి స్థానాన్ని బిఆర్ఎస్ ఖాతాలో వేసుకోగా.. ఆమనగల్లు మునిసిపాలిటీపై బిజెపి పాగావేసింది. రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తన బలాన్ని అనూహ్యంగా పెంచుకుంటున్న నేపథ్యంలో బిఆర్ఎస్‌లో అంతర్గత కుమ్ములాటలు పార్టీకి చేటు కలిగిస్తాయని ఆ పార్టీ క్యాడర్ ఆందోళన వ్యక్తంచేస్తోంది.

పార్టీ అధిష్ఠానం ఇప్పటివరకు ఈ వివాదంపై స్పష్టంగా స్పందించకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. సమయానికి జోక్యం చేసుకోకపోతే, ఈ అంతర్గత పోరు పార్టీ ఐక్యతను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆ పార్టీ కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇది బిఆర్ఎస్‌కు నష్టంగా మారవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉప్పల–జైపాల్ యాదవ్ వివాదం వ్యక్తిగత అభిప్రాయ భేదాలకే పరిమితమైతే పరిష్కారం సాధ్యమే. కానీ ఇది నాయకత్వ ఆధిపత్య పోరుగా మారితే, కల్వకుర్తి బిఆర్ఎస్‌లో చీలికలు తప్పదన్న

మిగతా 2లో

# సర్వే నివేదిక ప్రకారమే టికెట్లు

## డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్



కాంగ్రెస్ విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న వజ్రేశ్‌యాదవ్

**శామీర్‌పేట (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జనవరి 18, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ వారికి సర్వే ప్రకారమే గెలుపు గుర్రాలకు పార్టీ టికెట్లు దక్కుతాయని, పురపాలక ఎన్నికల్లో వార్డుల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే కాంగ్రెస్ పార్టీ నాయకులకు మంచి భవిషత్ ఉంటుందని, ప్రభుత్వ నామినేటెడ్, పార్టీలోనూ పదవులు మరిన్ని దక్కుతాయని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ స్పష్టం చేశారు. రానున్న పురపాలక ఎన్నికల్లో మేడ్చల్ జిల్లాలోని అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మూడు మున్సిపాల్టీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధినే పార్టీని గెలిపిస్తాయని అన్నారు. ఈ ప్రాంతాన్ని దోచుకున్న వారికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ చౌరస్తా వద్ద గల శుభం గార్డెన్‌లో జిల్లాలోని మూడు మున్సిపాల్టీలు అలియాబాద్, మూడుచింతలపల్లి,ఎల్లంపేట్‌ల కాంగ్రెస్ పార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశం అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగ జరిగిన సమావేశంలో మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ మూడు మున్సిపాల్టీల్లోని 68వార్డులను కాంగ్రెస్ పార్టీ గెలుచుకునేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలన్నారు. రిజర్వేషన్లతో కొంత వరకు అసంతృప్తి ఉన్నప్పటికీ సమగ్ర సర్వే ప్రకారం రిజర్వేషన్లు ఖరారు జరిగినట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించిన గ్రామాలకే భవిషత్‌లో ప్రభుత్వ

మిగతా 2లో

# వార్డులు 15.. దక్కింది 1

## ఆమనగల్లులో బిసిల నైరాశ్యం - అధికారులపై భగ్గుమంటున్న జెఎసి నేతలు

**ఆమనగల్లు, జనవరి 18, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీకి జరగనున్న ఎన్నికలకు కేటాయించిన వార్డుల రిజర్వేషన్లు తప్పులతడకగా ఉన్నాయని పలు బిసి సంఘాల జెఎసి మండి పడుతుంది. అత్యధిక జనభా ఉన్నా బిసిలకు ఒకేఒక్క వార్డు స్థానం కేటాయించడం దురదృష్టకరమని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం వెలువడిన వార్డుల రిజర్వేషన్ల కేటాయింపు జాబితాపై పలు బీసీ సంఘాలు భగ్గుమంటున్నాయి. ఆమనగల్లు మున్సిపాలిటీలో 15వార్డులు ఉన్నాయి. అయితే 14వార్డులు ఇతరులకు కేటాయించి బీసీలకు మాత్రం ఒకేఒక్క స్థానం కేటాయించడం అన్యాయమని, ముఖ్యంగా మహిళలకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేటాయించిన రిజర్వేషన్లు బిసిలకు ఎంతవరకు మేలు జరిగేలా ఉన్నాయో అధికారులే సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో 16,984 మంది ఓటర్లు ఉండగా, అందులో అత్యధికంగా బిసి ఓటర్లు కలిగి ఉన్నారు. బిసి ప్రాధాన్యత కలిగిన ఆమనగల్లు మున్సిపాలిటీలో ఏవిధమైన రిజర్వేషన్లు కేటాయించారో అధికారులు వివరణ ఇవ్వాలని బిసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆమనగల్లు మున్సిపాలిటీలో అత్యధికంగా బిసి ఓటర్లు ఉంటారు, అయితే దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించకుండా బీసీలకు అన్యాయం చేశారని, సింగిల్ స్థానం కేటాయించడం ఎంతవరకు సబబని, ఇది అధికారుల ఇష్టారీతికి నిదర్శనమని ఆరోపిస్తున్నారు. మేజం గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తరువాత 2019లో ఆమనగల్లు మున్సిపాలిటీకి జరిగిన మొదటి ఎన్నికల్లో అనుసరించిన రిజర్వేషన్ల కేటాయింపులను ఎటువంటి మార్పులు చేయకుండా, ఈసారి కూడా అవే రిజర్వేషన్లను యధాతథంగా అమలు చేయడం దురదృష్టకరమంటున్నారు. కేవలం మహిళల స్థానాలు మాత్రమే మార్పులు చేయడం జరిగిందన్నారు. ఈక్రమంలోనే బిసిలకు ఒకే స్థానం కేటాయించడం అన్యాయమన్నారు. 6ఏళ్ల తరువాత రెండవసారి జరుగుతున్న ఎన్నికల్లో కూడా వెనుకబడిన వర్గాలకు ఒకేఒక్క స్థానం కేటాయించి మొండిచేయి చూపడం జీర్ణించుకోలేకపోతున్నట్లు ఆసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్ల కేటాయింపు పూర్తిగా అసంబద్ధంగా ఉందని,

మిగతా 2లో

# ఆశావహుల హాల్‌చల్

## సోషల్ మీడియా వేదికగా ఫొటోలు, పోస్టులు- బరిలోకొస్తున్నామంటూ ప్రచారం

**ఆమనగల్లు, జనవరి 18, ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న పురపాలక సంఘం ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియ ఖరారు కావడంతో ఆమనగల్లులో ఎన్నికల సెగ రాజుకుంది. అన్ని పార్టీల నుండి ఆశావాహులు తమ అనుకూలమైన వార్డులను అన్వేషించుకుని హల్‌చల్ చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా తమ ఫొటోలను పోస్టులు పెడుతూ బరిలో దిగుతున్నామని ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆయా పార్టీల బిఫామ్‌లను దక్కించుకునేందుకు అగ్రనేతల ముందర వాలిపోతున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో 15వార్డులు ఉండగా, చైర్మన్ పదవి జనరల్‌కు కేటాయించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం జిల్లా ఎన్నికల అధికారులు రిజర్వేషన్ కేటాయించి జనవరి 17న ప్రకటించారు. ఈమేరకు కేటగిరీల ప్రకారం జనరల్‌కు 8, ఎస్టీ 4, ఎస్సీ 2, బీసి జనరల్ ఒకటి చొప్పున రిజర్వేషన్‌లు దక్కాయి. దీంతో రిజర్వేషన్‌ల ఉత్కంఠకు తెరపడి ఆశావాహులు వార్డుల అన్వేషణలో పడిపోయి ఎన్నికల సెగను రాజేశారు. అందరి అంచనాలు తలక్రిందులై చైర్మన్ పీఠం జనరల్‌కు వరించడంతో ఆమనగల్లులో రాజకీయం ఒక్కసారిగా రసవత్తరంగా మారిపోయింది. ఆయా పార్టీలలోని అన్ని వర్గాలకు అనుకూలంగా రిజర్వేషన్ రావడంతో ఆయా పార్టీల ముఖ్య నాయకులు చైర్మన్ పీఠంపై కన్నేసినట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. బిజేపి, కాంగ్రేస్, బీఆర్ఎస్ పార్టీలు మున్సిపాలిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇప్పటికే బిజేపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై అంతర్గత సర్వేలు చేపట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయా పార్టీల క్యాడర్, పార్టీ శ్రేణుల నుండి అభిప్రాయాలు సేకరించి అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలుస్తుంది. రేపోమాపో రానున్న ఎన్నికల నోటిఫికేషన్ నాటికి అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చేలా అధినాయకత్వం కసరత్తులు ప్రారంభించినట్లు వినిపిస్తుంది. ప్రస్తుతం ఆమనగల్లు మున్సిపాలిటీలో 15వార్డులు ఉండగా 16,984 మంది ఓటర్లు ఉన్నారు.

**అత్యధిక ఓటర్లు 1602...అత్యల్పం 816**

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో మొత్తం 16,984 మంది ఓటర్లు ఉన్నారు. అందులో స్త్రీలు అత్యధికంగా 8509 మంది ఉండగా పురుషులు 8475 మంది ఉన్నారు. కాగా అత్యధికంగా 6వ వార్డులో (సాయినగర్‌కాలనీ, గుర్రంగుట్ట) 1602 ఉండగా, అత్యల్పంగా 9వ వార్డులో (శ్రీకాంత్‌కాలనీ, విద్యానగర్) 816 మంది ఓటర్లు ఉన్నారు. దీంతోపాటు 1 వార్డులో 848 మంది ఓటర్లు ( పురుషులు 436, స్త్రీలు 412), 2వవార్డు 917 మంది ఓటర్లు (పురుషులు 446, స్త్రీలు 471) 3వ వార్డు 1403 మంది ఓటర్లు (పురుషులు 744, స్త్రీలు 659) 4వవార్డు 1120 మంది ఓటర్లు ( పురుషులు 550, స్త్రీలు 570) 5వవార్డు 1230 మంది ఓటర్లు (పురుషులు605, స్త్రీలు 625) 6వవార్డు 1602 మంది ఓటర్లు ( పురుషులు 780, స్త్రీలు 822) 7వవార్డు 980 మంది ఓటర్లు( పురుషులు 479, స్త్రీలు 501) 8వవార్డు 1141 మంది ఓటర్లు ( పురుషులు 549, స్త్రీలు 592) 9వవార్డు 816 మంది ఓటర్లు (పురుషులు 410, స్త్రీలు 406) 10 వవార్డు 1258 మంది ఓటర్లు (పురుషులు 645. స్త్రీలు 613) 11వవార్డు 1486 మంది ఓటర్లు (పురుషులు 776, స్త్రీలు 710) 12వవార్డు 1172 మంది ఓటర్లు( పురుషులు 571, స్త్రీలు 601) 13 వవార్డు 860 మంది ఓటర్లు ( పురుషులు 430,స్త్రీలు 430) 14వవార్డు 1093 మంది ఓటర్లు (పురుషులు 520, స్త్రీలు 573) 15వవార్డు 1058 మంది ఓటర్లు ( పురుషులు 534, స్త్రీలు 524) మంది ఉన్నారు.

## నేడు బండ్ల గణేష్

# సంకల్ప యాత్ర

## షాద్‌నగర్ నుంచి ప్రారంభం



**షాద్‌నగర్, జనవరి 18, ప్రభాతవార్త :** సినీ నిర్మాత బండ్ల గణేష్ మహా సంకల్పయాత్ర ఈ నెల 19న ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మీద వేసిన అభాండాలు తొలిగిపోవాలని, ఆయన చెరసాల నుంచి బయటికి కలియుగ దైవం వేంకటేశ్వరస్వామికి నా గడప నించి నీ కొండ దాకా పాదయాత్ర చేసి వస్తా అని మొక్కుకున్నానని బండ్ల గణేష్ తెలిపారు. స్వామి ఆశీస్సులతో చంద్రబాబు మళ్లీ అఖండ విజయంతో పూర్వ వైభవాన్ని సాధించుకున్నారని, ఇటీవలే కేసులు అన్నీ కొట్టేశారని తెలిపారు. అమ్మ నాన్నల ఆశీర్వాదాలతో..ఈనెల 19 ఉదయం 9 గంటలకు షాద్నగర్ తన ఇంటి ముందు కొబ్బరి కాయ కొట్టి పాదయాత్ర మొదలెట్టనున్నానని తెలిపారు. ఇది రాజకీయ యాత్ర కాదని, తన మనోవేదన తీర్చిన, వేంకటేశ్వర స్వామికి మొక్కుబడి చెల్లింపు అని పేర్కొన్నారు.



ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

## ఎమ్మెల్యే కసిరెడ్డి సేవలు అభినందనీయం

**మాడ్గుల, జనవరి 18, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు నాయకులు కొనియాడారు. మాడ్గుల మండలంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బట్టు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడిగా నారాయణరెడ్డిని ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు కొత్త పాండు గౌడ్, యాదయ్య గౌడ్, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్గత సంక్షోభం

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ భవిష్యత్తు కోసం ఇరువర్గాలు రాజీ మార్గం వెతకాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు కోరుతున్నారు. మొత్తానికి, కల్వకుర్తి బిఆర్ఎస్‌లో ఉప్పల వర్సెస్ యాదవ్ పోరు వ్యక్తిగత వివాదాన్ని మించి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే స్థాయికి చేరిందని స్పష్టంగా కనిపిస్తోంది.



పారిశుధ్య పనులు చేయిస్తున్న గౌస్ జానీ

## సొంత ఖర్చులతో పారిశుధ్య పనులు

**షాద్‌నగర్ టౌన్, జనవరి 18, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ వెంచర్, నాగులపల్లి రోడ్డు వద్ద వైద్య కాల్చి పర్యావరణాన్ని పాడు చేయడం, అనేక వ్యర్థ పదార్థాలను పడవేసిన సంఘటనలను మీడియా ద్వారా తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ సభ్యులు యువ నాయకుడు గౌస్ జానీ ఈ వ్యవహారం పై వెంటనే స్పందించారు. తన అనుచరులతో కలిసి వెంకటేశ్వర కాలనీ వెంచర్ నాగులపల్లి రోడ్డు తదితర ప్రాంతాలలో ప్రత్యేక డోజర్, జేసిబి వాహనాలు పురమాయించి వెంటనే పారిశుధ్య పనులు చేపట్టారు. ఫరూక్ నగర్ ప్రాంతం పూర్తిగా బదునాం అవుతుందని ఇక్కడ స్థానిక ప్రజలు పారవేస్తున్న చెత్తాచెదారం జంతువుల కళేబరాలు వైద్య వ్యర్థాల తదితర పరిణామాలతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో నష్టం జరుగుతుందని దీనిపై ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని దయచేసి వెంటనే వీటిని ఆపేయాలి అంటూ స్థానిక నేత గౌస్ జానీ ముందడుగు వేశారు. సొంత ఖర్చులతో తన అనుచరులతో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. ఇలా చెత్త వేయడం వైద్య కాల్చడం వల్ల అనేక రోగాలు రుగ్మతలు అనారోగ్యం వస్తుందని ఇది ఎవరికి మంచిది కాదని అనవసరంగా ఇక్కడ చెత్త వేసి ఈ ప్రాంతం పేరు ఆ ప్రతిష్టను దెబ్బతీయకూడదని గౌస్ జానీ సూచించారు. ముందు మన ఇల్లు వాడ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందని చెత్తాచెదారం ఉంటే మున్సిపాలిటీకి ఫిర్యాదు చేసి వెంటనే వారు పంపించిన ట్రాక్టర్లు వెయ్యాలని అంతేతప్ప ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయకూడదని గౌస్ జానీ సూచించారు.



గోల్ఫ్ ఆడుతున్న నటుడు జగపతిబాబు, నటి సంయుక్త

## గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

**గచ్చిబౌలి, జనవరి 18 ప్రభాతవార్త :** ఆర్థికంగా వెనుకబడిన క్యాన్సర్ చిన్నారులకు అండగా నిలిచేందుకు, క్యాన్సర్‌పై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించే 9వ ద్వైవార్షిక అపర్ణా క్యాన్సర్ క్రూసేడర్స్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం గచ్చిబౌలిలో ప్రముఖ నటుడు జగపతిబాబు, నటి సంయుక్త మీనన్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. గచ్చిబౌలిలోని బౌల్డర్ హిల్స్‌లో క్యూర్ ఫౌండేషన్, అపోలో క్యాన్సర్ సెంటర్‌ల ఆధ్వర్యంలో జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఈ పోటీలు కొనసాగనున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ పోటీల్లో 450 మంది గోల్ఫర్లు, కార్పొరేట్ నేతలు, ప్రముఖులు పాల్గొననున్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌తో క్యాన్సర్ బాధితులకు నిధుల సమీకరించడంతో పాటు సమాజంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించనున్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌ను స్టేబుల్ ఫోర్డ్ ఫార్మాట్‌లో 100 శాతం హ్యాండిక్యాప్ విధానంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్యూర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ క్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 1500 మందికి పైగా క్యాన్సర్ బాధితులకు ఉచితంగా, సబ్సిడీతో క్యాన్సర్ చికిత్స అందించినట్లు తెలిపారు. చిన్నారులకు ఉచితంగా క్యాన్సర్ చికిత్స అందించడం క్యూర్ ఫౌండేషన్ లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. సరైన సమయంలో చికిత్స అందితే క్యాన్సర్ బారినపడిన చిన్నారులను రక్షించవచ్చన్నారు. ఖరీదైన క్యాన్సర్ చికిత్సను భరించలేని ఆర్థికంగా వెనుకబడిన చిన్నారులను ఆదుకునేందుకు నిధుల సేకరణ కోసం ఈ ద్వైవార్షిక ఛాంపియన్‌షిప్ గోల్ఫ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రైడ్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి, అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ ఈడి అపర్ణారెడ్డి, ఎమ్మార్ ప్రాపర్టీస్ సీఎఫ్‌ఓ ఎన్‌ఆర్‌ఎన్.రెడ్డి, హెచ్‌ఐసిసి జనరల్ మేనేజర్ రుబిన్ చెరియాన్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీలకు అండగా ఉంటా : కాలేరు

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో పద్మశాలిలకు అవకాశం కల్పిస్తానని అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హామీ ఇచ్చారు. ఆసక్తి ఉన్న వారు ముందుకు వస్తే సీట్లు కేటాయిస్తానని చెప్పారు. ఆదివారం ఎస్వీఆర్ ఫక్షన్‌హాల్‌లో జరిగిన నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

# మున్సిపాలిటీకి ప్రగతి కాంతులు

### రూ.2.90 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్ టౌన్, జనవరి 18, ప్రభాతవార్త :** మున్సిపాలిటీలకు ప్రగతి వెలుగులు తెచ్చేందుకు రూ.2.90 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఆదివారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో పట్టణంలోని ఒకటవ వార్డులో రూ. 42 లక్షలతో రెండు సిసి రోడ్లు, రెండవ వార్డులో రూ. లక్షతో కాలువ నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మీదుగా సిసి రోడ్డు, 9వ వార్డులో 35 లక్షలతో సిసి రోడ్డు, పదో వార్డులో 15 లక్షలతో మరో సిసి రోడ్డు, 14 18 వార్డుల్లో 31 లక్షలతో రెండు సిసి రోడ్లు, 22వ వార్డులో పది లక్షలతో మరో సిసి రోడ్డు, 27వ వార్డులో ఏడు లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. పనులకు త్వరలోనే శంకుస్థాపన చేసి వెంటనే ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. నేతలు మహమ్మద్ అలీ ఖాన్ బాబాయ్, అగునూరు విశ్వం, రఘు నాయక్, అగునూరు బస్వం, అందే మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

**మూడు మండలాలకు 10 కోట్ల నిధులు**

షాద్ నగర్ నియోజకవర్గంలోని మూడు మండలాలకు ముచ్చటగా అభివృద్ధి పనుల నిమిత్తం 10 కోట్ల రూపాయలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంజూరు చేశారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తూరు మండలంలో తిమ్మాపూర్ నుంచి నానాజీపూర్ మీదుగా గూడూరు వరకు బిటి రోడ్డు ను రూ.5.75 కోట్లతో నిర్మాణం చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కేశంపేట మండలంలో గ్రామస్తులు ఎప్పటి నుంచి అడుగుతున్న వంతెన నిర్మాణాన్ని 2.25 కోట్లతో చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇక కొందరుకు మండలంలో ఆగిరియాల ఎస్సీ కాలనీ నుంచి కొల్లూరు వరకు రహదారి నిర్మాణానికి రెండు కోట్ల కేటాయించినట్లు వెల్లడించారు. ఎందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని త్వరలోనే రహదారి నిర్మాణాలు పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. చిత్తశుద్ధితో ప్రగతి.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గ ప్రగతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే వేర్లపల్లి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మాపూర్‌గూడూరు మధ్య రహదారిని గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించడం జరిగిందన్నారు. కానీ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు గంప మట్టిని కూడా పోయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా పాటి గడ్డ వంతెన కోసం గ్రామస్తులు ఎప్పటినుంచో అడుగుతున్నారని, అందుకే ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు వెంటనే మంజూరు చేయించడం జరిగిందని వెల్లడించారు. కొందురు మండలం పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నందిగామ మండల పార్టీ అధ్యక్షుడు జంగా నరసింహ యాదవ్, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, కేశంపేట మండల పార్టీ అధ్యక్షుడు వీరేష్, పాటిగడ్డ సర్పంచ్ అఖిల్, నిద్ర వెల్లి సర్పంచ్ భాస్కర్ గౌడ్, రాందాస్ శ్రీరాములు గూడూరు దయానంద్ బాల శౌరి రెడ్డి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ఉపాధి హామీపై అవగాహన

### డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

**రంగారెడ్డి అర్బన్, ప్రభాతవార్త జనవరి 18:** ఉపాధిహామి చట్టంపై పతి పల్లెలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. ఈనెల 20 నుంచి వచ్చేనెలా ఒకటో తేది వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చేవెళ్ల మండలం ఆలూరు గ్రామం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. నాడు మన్మోహన్ సింగ్ ప్రారంభించిన శిలాఫలకం నుంచి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎనమిది నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, టీపీసీసీ నేతలు హాజరవుతున్నట్లు చెప్పారు. పార్టీ సీనియర్ నాయకులు, కొత్తగా గెలుపొందిన సర్పంచ్లు, వార్డు సభ్యులతో పాటు మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వీబీజీ రామ్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపాధి హక్కు, పంచాయతీలకు పాలన హక్కులు తిరిగి కల్పించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఉపాధి హక్కును కాలరాస్తూ, గ్రామ పంచాయతీలకు రాజ్యాంగ బద్ధంగా లభించిన అధికారాలను నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు.

## వార్డులు 15 - దక్కింది 1

(మొదటి పేజీ తరువాయి)

శాస్త్రీయంగా జరగలేదని విమర్శిస్తున్నారు. అత్యల్ప సంఖ్యలో ఉన్న వర్గాలకు డబల్ డిజిట్‌లు, అత్యధికంగా ఉన్నవారికి సింగిల్ డిజిట్ కేటాయింపు అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దమని అసంతృప్తిని వెళ్ళబుచ్చుతున్నారు. అధికారుల తీరుతో బిసిలు రాజకీయంగా పూర్తిగా వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న కపట ప్రేమకు ఆమనగల్లు మున్సిపాలిటీ రిజర్వేషన్లు నిదర్శనమని పలు బీసీ సంఘాలు బాహాటంగా ఆరోపిస్తున్నాయి. కాగా శనివారం వెలువడిన రిజర్వేషన్ కేటాయింపు ప్రకారం జనరల్‌కు 8, ఎస్టీ4, ఎస్సీ2, బీసీలకు1(జనరల్) స్థానం కేటాయించిన విషయం పాఠకులకు తెలిసిందే.

## బల ప్రదర్శన చేస్తే టికెట్ కట్

(మొదటి పేజీ తరువాయి)

వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. జరగబోయే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆయన ఈ మాటను స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గత మున్సిపాలిటీ పాలకులు ఎన్ని అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు పట్టణ ప్రజలకు తెలుసని అన్నారు. ముఖ్యంగా గత పాలకుల మాదిరిగా తమ ప్రభుత్వం హయాంలో ఎవరి ఇండ్లు కూలగొట్టమని, ఎవరి వద్ద డబ్బులు వసూలు చేయమని, కంకర పోసి కమిషన్లు అడగమని అన్నారు.

నిష్పక్షపాతమైన ప్రజా పరిపాలన అందిస్తామని వసూళ్లకు పాల్పడేవారిని ఉపేక్షించమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిజాయితీగా ప్రజాసేవకు కట్టుబడిన వారికి మాత్రమే కాంగ్రెస్ బిఫార్మ్ ఇస్తామని ఎమ్మెల్యే మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మహమ్మద్ అలీ ఖాన్ బాబాయ్, అగునూరు విశ్వం, రఘు నాయక్, అగునూరు బస్వం, అందే మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే ప్రకారమే టికెట్లు

(మొదటి పేజీ తరువాయి)

నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు దక్కుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కష్టపడి పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా పట్టుదలతో కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి బిఆర్ఎస్, బిజెపిలు మాత్రమే ఎన్నికల్లో శత్రువులు అని, కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరి కలిసి సమిష్టిగ ఉండి పనిచేయాలని,కష్టపడ్డవారిని పార్టీ గుర్తింపును ఇస్తుందని, రిజర్వేషన్లు రాక అసంతృప్తిలో ఉండి పార్టీకోసం పనిచేయకుండ వెన్నుపోటు పొడవకుండ ముందుగానే పార్టీ నుంచి బయటకు వెళ్లిపోవాలని ఆయన సూచించారు. పార్టీ నాయకుల్లో మనస్పర్ధలు లేకుండ కలిసి మున్సిపల్ ఎన్నికల్లో పనిచేయాలని, మంచి భవిషత్ ఉంటుందని వజ్రేశ్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, వంట గ్యాస్, సన్నబియ్యం, మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం పలు సంక్షేమ పథకాలను, ఇందిరమ్మ చీరెల పంపిణీ అమలు చేస్తుందని వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు కార్యచరణ చేసుకోవాలని, పార్టీ టికెట్లు పనిచేసిన వారికి, గెలిచే వారికి సర్వే చేసి టికెట్లు ఖరారు జరుగుతుందని వజ్రేశ్‌యాదవ్ స్పష్టం చేశారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం,సుధీర్‌రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ జిల్లాలోని మూడు మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతుందని,పార్టీ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టపడి పనిచేయాలని, అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారికి గెలిచే సత్తా ఉన్న వారికి టికెట్లు సర్వేప్రకారం అందుతాయని గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారు సూచించారు. ఈ సమావేశంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి మాజీ చైర్మన్ సత్యనారాయణ, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, ఎల్లంపేట్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు విఘ్నేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి పి.బాలేశ్, సీనియర్ నాయకులు జి.మహేందర్‌రెడ్డి, కె.కృష్ణారెడ్డి, వై.శంకర్‌గౌడ్, ఇర్రి రవీందర్‌రెడ్డి, ఎం.మహేందర్‌యాదవ్, ఎద్దు నాగేశ్‌యాదవ్, పలువురు మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, పలు మున్సిపాల్టీల అధ్యక్షులు, పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం సభకు తరలివెళ్లిన మండల నేతలు

**శామీర్‌పేట, జనవరి 18, ప్రభాతవార్త :** ఖమ్మంలో జరిగిన సిపిఐ జయంతి ఉత్సవాలు, సిపిఐ పార్టీ బహిరంగసభకు మూడుచింతలపల్లి మండల సిపిఐ కార్యదర్శి టి.రాములుగౌడ్ ఆధ్వర్యంలో వాహనంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఆదివారం మూడుచింతపల్లి మండల సిపిఐ నాయకులు, పలువురు కార్యకర్తలు ఖమ్మంలో జరిగే సిపిఐ పార్టీ బహిరంగసభకు తరలివెళ్లారు. బహిరంగసభకు తరలివెళ్లిన వారిలో మండల సిపిఐ కార్యదర్శి టి.రాములుగౌడ్‌తో పాటు సిపిఐ నాయకులు, కార్యకర్తలు వెంకటేశ్‌యాదవ్, కొంపల్లి యాదగిరిగౌడ్, పల్లె యాదగిరి,నర్సింగ్‌రావు, ఉడుతల ఆగమయ్య, తదితరులు వెళ్లారు.

## క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

**శామీర్‌పేట, జనవరి 18, ప్రభాతవార్త :** యువకులను ప్రోత్సహించటానికి క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు, అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్‌లలో మూడు మున్సిపాల్టీల్లో క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశామని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం (మూడురోజుల పాటు నిర్వహించిన) క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ గ్రౌండ్‌లో అలియాబాద్ మున్సిపాల్టీ, మూడుచింతలపల్లి మున్సిపాల్టీ వారికి క్రికెట్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి ఎమ్మెల్యే మల్లారెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సిఎంఆర్ ట్రోఫీ క్రికెట్ పోటీలు మూడు రోజుల పాటు నిర్వహించినట్లు ముగింపు కార్యక్రమంతో విన్నర్‌లకు, రన్నర్‌లకు విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమం జరిగింది. ముందుగా మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో క్రికెట్ ఫైనల్‌లో లింగాపూర్‌తండ టీమ్ విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. అనంతారం క్రికెట్ టీమ్ రన్నర్‌గా నిలిచిందని అన్నారు. విన్నర్ టీమ్‌కు 25వేల రూపాయల నగదు బహుమతితో పాటు కప్, రన్నర్ టీమ్‌కు 15వేల రూపాయల నగదు బహుమతితో పాటు కప్‌ను ఆయన అందజేశారు. అదే విధంగ అలియాబాద్ మున్సిపాల్టీలోని క్రికెట్ పోటీల్లో లాల్‌గడిమలక్‌పేట్ టీమ్ విన్నర్‌గా, అలియాబాద్ టీమ్ రన్నర్‌గా నిలిచింది. విన్నర్ టీమ్ లాల్‌గడిమలక్‌పేట్ వారికి 25వేల నగదు, కప్, అలియాబాద్ రన్నర్ టీమ్‌కు 15వేలతో పాటు కప్‌ను ఎమ్మెల్యే మల్లారెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు భద్రారెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, రెండు మండలాల బిఆర్ఎస్ పార్టీల అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, జి.మల్లేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు పి.సతీష్‌రెడ్డి, టి.అనిల్‌రెడ్డి, సి.శ్రీనివాస్‌రెడ్డి, జామ్ రవి, పలువురు పార్టీ నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి

## మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**ఘట్‌కేసర్, జనవరి 18, ప్రభాతవార్త:** మధ్యాహ్నభోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు చింతల యాదయ్య, ఉన్నికృష్ణ శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నభోజన కార్మికుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్ అక్షయపాత్ర సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం రెండు నియోజకవర్గాలకు ఒకటి చొప్పున అప్పగించాలని సీఎం రేవంత్‌రెడ్డి జీఓ నెం.9ని తీసుకువచ్చారని, ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకుండా ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్మికులనే కొనసాగిస్తూ సక్రమంగా బిల్లులు మంజూరు చేసి మెనూ పెంచాలని డిమాండ్ చేశారు. ఇంతకుమందు కూకట్‌పల్లి లాంటి ప్రదేశాల్లో మధ్యాహ్నభోజన కార్మికులను తొలగించి ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పి మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు సరఫరా చేస్తున్నారని దీంతో ఒక వ్యాన్ అన్ని గ్రామాలను రవాణా ద్వారా తీసుకొచ్చి వేయడంతో భోజనం చల్లారి రుచికరమైన ఆహారం పిల్లలకు అందడం లేదని తెలిపారు. ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వారు కార్మికులకు పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ని కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేస్తారని తెలిపారు. ఈసమావేశంలో మధ్యాహ్నభోజన కార్మికులు కవిత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య, ఉన్నికృష్ణ శ్రీనివాస్

## మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డు నుంచి పోటీ

**శామీర్‌పేట, జనవరి 18, ప్రభాతవార్త :** అలియాబాద్ మున్సిపాల్టీలోని 20వ వార్డులలో బిజెపి అభ్యర్థి పోటీలో ఉండేలా, విజయం సాధించేలా పార్టీ నాయకులు కసరత్తులు చేసుకోవాలని బిజెపి రాష్ట్ర నాయకులు పి.విక్రమ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో బెజెపి నాయకుల సమావేశం అధ్యక్షులు కొరివ కృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగ పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు పి.విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించి కాషాయరంగు జెండాను ఎగురవేస్తామని అన్నారు. అలియాబాద్ మున్సిపాల్టీలో ఉన్న 20వ వార్డులలో బిజెపి విజయం సాధించేలా పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు ధీటుగా బిజెపి అభ్యర్థులను ఎంపిక చేసి పోటీలో నిలబెట్టటానికి పార్టీ కసరత్తులు జరుగుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి విజయానికి పార్టీ నాయకులు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, అలియాబాద్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణ, మాజీ వైస్‌ఎంపిపి వంగరి హృదయ్‌కుమార్, జిల్లా నాయకులు ఎం.అశోక్, మాజీ సర్పంచు బీర్కూరి వెంకటేశ, పార్టీ నాయకులు మాదవరెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, తుంకి భాస్కర్, బ్రహ్మానందరెడ్డి, అశోక్‌కుమార్, టి.వివేకానంద, సిహెచ్ వెంకటేశ, మంచినీళ్ల లక్ష్మణ్, నరేందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు విక్రమ్‌రెడ్డి

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

### చీఫ్ విప్ పి.మహేందర్‌రెడ్డి రాక

**శామీర్‌పేట, జనవరి 18, ప్రభాతవార్త :** మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపాల్టీల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్,ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి సోమవారం ఉదయం పర్యటిస్తున్నట్లు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని ఆయా మున్సిపాల్టీల కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, దోసకాయల వెంకటేశ్‌లు తెలిపారు. అలియాబాద్ మున్సిపాల్టీలోని వివిధ గ్రామాల్లో, మూడుచింతలపల్లి మున్సిపాల్టీల్లోని పలు గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని అన్నారు.

ఇందిరమ్మ చీరెలను కూడ మహిళలకు పంపిణీ చేస్తారని అన్నారు. అదే విధంగ మూడుచింతలపల్లిలో నిర్మించిన మండల తహసీల్దార్ నూతన కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ ఎండి గులాం ఇద్రీస్ తెలిపారు. ఆయనతో పాటు ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపాల్టీల్లో ప్రభుత్వ ఛీఫ్ విప్ మహేందర్‌రెడ్డి పర్యటన ఉంటుందని, ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, పలువురు పార్టీ నాయకులు పాల్గొననున్నట్లు ఆయా మున్సిపాల్టీల కాంగ్రెస్ అధ్యక్షులు తెలిపారు. ఆ తరువాత మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట్ మున్సిపాల్టీలో పర్యటనకు బయలు దేరనున్నట్లు తెలిపారు.

**మూడు మున్సిపాల్టీల్లో మంత్రుల పర్యటన..?**

రాష్ట్ర మంత్రి,జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడి, ప్రభుత్వ ఛీఫ్‌విప్, ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ

**మహేశ్వరం, జనవరి 18, ప్రభాతవార్త:** రావిరాల జన్నాయిగూడలో ప్రసిద్ద గాంచిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ ఆదివారం లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ కోటగళ్ల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి చల్లని దీవెనలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సుప్రజా యాదయ్య, రేణుక ఎల్లమ్మ దేవాలయ డైరెక్టర్ అర్జున్, నరేష్ రెడ్డి ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మద్దూర్ గ్రామస్తులు

## కాంగ్రెస్‌తోనే అందరికీ సమన్యాయం

**షాబాద్, జనవరి 18, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీతోనే అందరికి సమన్యాయం చేకూరుతోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మద్దూర్ గ్రామం బీఆర్ఎస్ పార్టీకి చెందిన 5వ వార్డు సభ్యుడు రమేష్ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే యాదయ్య మద్దూర్ సర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు దశల వారిగా అమలు చేస్తుందన్నారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, మహిళలకు ఉచిత బస్సు, గృహలక్ష్మీ క్రింద 200 యూనిట్ల విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూందన్నారు. తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంతరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. మద్దూరు గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాంరెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, ప్రభాకరరెడ్డి. గ్రామస్తులు పాల్గొన్నారు.



కురుమ సర్పంచులను సన్మానిస్తున్న నాయకులు

## కురుమలు అన్ని రంగాల్లో రాణించాలి

**షాబాద్, జనవరి 18, ప్రభాతవార్త :** కురుమలు అన్ని రంగాలల్లో రాణించాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్ అన్నారు. ఆదివారం నగరంలో కురుమ సంఘం తరుపున నూతనంగా గెలిచిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కురుమలు విద్య ఉపాధి, రాజకీయ, వ్యాపార వంటి అన్ని రంగాలల్లో సామాజికంగా ఆర్థికంగా సామాజిక ఐక్యతతో పాటు, కుల వృత్తులతో మార్గాలను అన్వేషించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కురుమలు సంఘటితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చెన్నయ్య కుమార్, ఉపసర్పంచులు శివకుమార్. మాణిక్యం, కురుమ సంఘం నాయకులు రాపోల్ నర్సింహులు, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం సభకు తరలిన షాబాద్ కామ్రేడ్లు

**షాబాద్, జనవరి 18, ప్రభాతవార్త :** హలో కామ్రేడ్ చలో ఖమ్మం సభకు షాబాద్ మండలం నుండి భారీ సంఖ్యలో ఆదివారం తరలి వెళ్లారు. సిపిఐ షాబాద్ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం ఆధ్వర్యంలో బస్సుల్లో ఖమ్మంలోని సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలాల్ రాజేందర్ గౌడ్, మళ్ళీ మధు, నక్కని జంగయ్య, పాలమాకుల ఆనందం, దుర్గయ్య, సిపిఐ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూములు లాక్కుంటే ఉద్యమిస్తాం

### మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్‌రెడ్డి

**షాబాద్, జనవరి 18, ప్రభాతవార్త :** నిరుపేదలకు జీవనాధారమైన ప్రభుత్వ భూములు లాక్కుంటే చూస్తూ ఊరుకోమని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం షాబాద్లో ఆయన రేగడిదోస్వాడ, తాళ్లపల్లి, మక్తగూడ, తిమ్మారెడ్డిగూడ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నాలుగు గ్రామాల్లో సుమారు 400 ఎకరాల వరకు ప్రభుత్వ భూమిని రైతుల నుండి తీసుకొని ప్రైవేటు సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగిస్తున్నట్లు తెలుస్తుందని, అలా చేస్తే సహించేదిలేదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా భూములను నమ్ముకొని సాగుచేసుకొని జీవనం కొనసాగిస్తున్న రైతుల పొట్ట కొట్టడం సరికాదన్నారు. వందల కుటుంబాలు ఆ భూముల్లో పంటలు సాగు చేస్తూ జీవిస్తున్నారన్నారు. భూములు కోల్పోతే వారి కుటుంబాలు రోడ్డున పడతారని తెలిపారు. ఈ నెల 22వ తేదిన ఈ గ్రామాల బాదితులకు మద్దతుగా కార్యక్రమం చేపడతామని, ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కార్తీక్ రెడ్డి లు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## కులాల మధ్య చిచ్చు పెట్టకండి

**మోమిన్‌పేట్, జనవరి 18, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తనకు నచ్చిన పదజాలాలతో అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని ఎస్సీ సెల్ పార్లమెంట్ ఇన్చార్జి సోమారపు రవి హితవు పలికారు. ఆదివారం ఆయన ప్రభాతవార్త తో మాట్లాడుతు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే చీటికీ మాటికి ప్రసాద్‌కుమార్ పై వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని అన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూడడం సిగ్గుచేటు అన్నారు. బిఆర్ఎస్ చిత్తుగా ఓడిపోవడంతో మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. కులాల గురించి కాకుండా వికారాబాద్ అభివృద్ధి గురించి మాట్లాడితే బాగుంటుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అవినీతిపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపడుతున్నాయని అన్నారు. వికారాబాద్ జిల్లా ను మారుస్తారని ఆరోపణ చేయడం సరైంది కాదన్నారు.



లైన్లో వేచి ఉన్న భక్తులు

# పాంబండ ఆలయానికి పోటెత్తిన భక్తులు

**-ఆదివారం అమావాస్య ప్రత్యేక పూజలు-మొక్కులు చెల్లించుకున్న భక్తులు**

**కుల్కచర్ల,జనవరి 18, ప్రభాతవార్త:** ఆదివారం అమావాస్య సందర్భంగా శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శివయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ పవిత్రమైన రోజున,పౌర్ణమి, అమావాస్య వంటి ప్రత్యేక రోజుల్లో పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.ఇక్కడి శివలింగం భూమి నుండి గంగతో ఉద్భవించిందని, శ్రీరాముడు ప్రతిష్టించిన లింగం అని ఇక్కడ ప్రతి పౌర్ణమికిగిరి ప్రదక్షణ జరుగుతుంది. గిరి ప్రదక్షణకు వందలాది మంది భక్తులు వస్తుంటారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఛైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి, ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

# బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య క్యాలెండర్ అవిష్కరణ

**కొడంగల్,జనవరి 18,ప్రభాతవార్త :** బ్రహ్మణ సేవా సంఘం సమాఖ్య కొడంగల్,శంకర సేవా సమితి



నూతనంగా ఎన్నికైన బ్రహ్మణ సేవా సంఘ సమాఖ్య సర్పంచ్‌లను సన్మానించిన దృశ్యం

సంయుక్త అద్వర్యంలో శంకర సేవా సమితి నూతన సంవత్సర క్యాలెండర్ అవిష్కరణ చేపట్టారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో క్యాలెండర్ అవిష్కరణ అనంతరం బ్రహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర బాధ్యులు వికారాబాద్‌జిల్లా నియామక పత్రాల అందజేత కార్యక్రమం నిర్వ హించారు.అలాగే ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బ్రహ్మణ అభ్యర్దులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్బంగా బ్రహ్మణ సేవాసంఘసమాఖ్య అధ్యక్షులు మోత్కూరి రామచారి,కార్యదర్శి వైద్య ప్రభాకర్ శర్మ,సంగారెడ్డి జిల్లా బ్రహ్మణ సంఘ సేవా సమాఖ్య అద్యక్షులు రామారావు దేశ్‌పాండే,రాష్ట్ర యువజన సంఘం అద్యక్షులు సతీష్‌ల అద్వర్యంలో వికారాబాద్ జిల్లాలోని నూతన సర్పంచ్‌లు,వార్డు సభ్యులను శాలువా,పూలమాలలతో సన్మానించారు.ఇందులో దౌల్తాబాద్ మండలం బాలంపేట్‌ఉ చెందిన మ్రోద్‌రావు కులకర్ణి,కొడంగల్ మండలంలోని చిన్ననందిగామ సర్పంచ్ కరుణం దత్తాత్రేయరావు,యాలాల మండలంలోని దేవనూర్ సర్పంచ్ రేణుక కిషన్‌రావు,పరిగి మండలంలోని రంగాపూర్,పూడూర్ గ్రామ వార్డు సభ్యులు సతీష్ దేశ్‌పాండేలను సన్మానించారు.ఈ కార్యక్రమంలో శంకర సేవా సమితి సభ్యులు కొడంగల్ అద్యక్ష,కార్యదర్శులు,బ్రహ్మణ సేవా సంఘ సమాఖ్య కొడంగల్,వికారాబాద్,పరిగి,తాండూర్ తదితర నియోజకవర్గాల సభ్యులు పాల్గొన్నారు.

# నగర పర్యాటకాభివృద్ధికి 'హైదరాబాద్ టూరిజం వీకెండ్ గేట్‌వేస్'

**జూబ్లీహిల్స్, జనవరి 18, ప్రభాతవార్త**

నగరంలో మొదటిసారిగా నిర్వహించిన టూరి జం రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ మేకింగ్ బూట్ క్యాంప్ శనివారం జూబ్లీహిల్స్‌లోని క్రియేటర్‌వర్స్ లో నిర్వ హించారు. వివిధ రంగాలకు చెందిన 58 మంది పాల్గొన్నారు.బూట్‌క్యాంప్‌ను ఫెడరేషన్ ఆఫ్ తెలం గాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టి సీసీఐ) టూరిజం కమిటీ ఆధ్వర్యంలో క్రియే టర్‌వర్స్-ఇండియాస్ ఫస్ట్‌కంటెంట్ ఫ్యాక్టరీ సహ కారంతో నిర్వహించారు. టూరిజం రీల్స్‌ను ఆకర్ష ణీయంగా, ప్రభావవంతంగా, వైరల్ అయ్యేలా రూపొందించే నైపుణ్యాలను ఈ శిక్షణలో నేర్పిం చారు. ఈ ఇన్‌హౌస్ బూట్‌క్యాంప్ సాధారణ ప్రజ లను శక్తివంతమైన డిజిటల్ స్టోరీటెల్లర్స్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించారు. ఇందులో భాగంగా జనవరి 24న మూడు పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లి అవుట్‌డోర్ హ్యాండ్స్ ఆన్ సెషన్ నిర్వహించను న్నారు. క్రియేటర్‌వర్స్ వ్యవస్థాపకుడు డా. మణి పవిత్ర డిజిటల్ వైరాలిటీపై మాట్లాడుతూ రీల్ తయారీ ఒక శాస్త్రమని, మొదటి మూడు సెకన్లే అన్నింటినీ నిర్ణయిస్తాయన్నారు. ఆ సమయంలో వీక్ష కుడిని ఆకట్టుకో లేకపోతే రీల్ దాటవేయడం అవు తుందని, ఈ విషయాన్ని అల్గారిథమ్ గమనిస్తుంద న్నారు. స్కిప్ రేటు తక్కువగా ఉంటే ఇన్‌స్టాగ్రామ్ ఆ రీల్‌ను నాన్ ఫాలోవర్లకు పంపుతుందన్నారు. వైరల్ రీల్స్ అదృష్టంకాదని, వ్యూహం, మానసిక శాస్త్రం, టైమింగ్ కలయిక అనిఅన్నారు. రీల్స్ బాగు న్నందుకే వైరల్ కావని, స్కిప్‌చేయకపోతేనే వైరల్ అవుతాయన్నారు. వైరాలిటీ అల్గారిథమ్ ట్రిక్ కాదని, భావోద్వేగ అను సంధానమని, అనేక హృదయాల్లో పునరావృతమయ్యే ప్రక్రియ అని అన్నారు. గత ఏడాది కాలంలో క్రియే టర్ వర్స్ బూట్‌క్యాంప్‌ల ద్వారా 50,000కుపైగా రీల్స్ రూపొందించామ న్నారు. 550 మందికిపైగా ప్రొఫెషనల్స్, వ్యాపార వేత్తలు, డాక్టర్లు తమ సొంత కంటెంట్‌ను రూపొం దించారన్నారు. తెలంగాణలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలతోపాటు, తెలియని పర్యా టక ప్రదేశాలను రీల్స్ ద్వారా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, హైదరాబాద్ టూరి జం వీకెండ్ గెటవేస్" రీల్ కాంటెస్ట్‌నేపథ్యంలో ఈ బూట్‌క్యాంప్ నిర్వహించబడిందన్నారు. డిజిటల్ ప్రపంచంలో పర్యాటక ప్రాంతాలకు గుర్తింపు కల్పించడం ద్వారా తెలంగాణ టూరిజాన్ని ప్రోత్సహించ డమే తమ ఉద్దేశమన్నారు. రీల్స్ ఇప్పుడు ప్రయాణ నిర్ణయా లను ప్రభావితం చేసి, వాస్తవ ఆర్థిక ప్రయోజనా లను తీసుకువస్తున్నాయి అని టూరిజం కమిటీ సహ చైర్మన్ డి.రాంచంద్రమ్ తెలిపారు. భవిష్యత్ డిజిటల్ కమ్యూనికేషన్‌నేకే ఉందన్నారు. ప్రతిరోజూ ప్రపంచవ్యాప్తంగా 40 వేల కోట్లకుపైగా రీల్స్ వీక్షి స్తున్నారని, మన మెదడు టెక్స్ట్ కంటే వీడియోను 60వేల రెట్లు వేగంగా ప్రాసెస్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టిసీసీఐ టూరిజం కమిటీ చైర్మన్ ప్రకాశ్ అమ్మనబోలు,డైరెక్టర్ సంగీత మాట్లాడుతూ, ఈ బూట్‌క్యాంప్ ద్వారా ప్రయాణికులు, టూరిజం రంగంలోని వర్గాలకు ప్రాక్టికల్ రీల్ మేకింగ్ నైపు ణ్యాలు అందించి, హైదరాబాద్ చుట్టుపక్కల వీకెండ్ టూరిజం గమ్యస్థానాల ప్రచారానికి నాణ్యమైన కంటెంట్ సృష్టించడమే లక్ష్యమన్నారు.

# 475 మందికి వైద్య పరీక్షలు

## మందుల పంపిణీ



**ఘట్‌కేసర్, జనవరి 18, ప్రభాతవార్త:** నీలిమ ఆసుపత్రి అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఘట్‌కేసర్ మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ మైసమ్మగుట్టకాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనగామ శాసనసభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు నీలిమ ఆసుపత్రిలో ఉచిత వైద్య చికిత్స సేవలు అందించడం హర్షదాయకమని నర్సింగ్‌రావు పేర్కొన్నారు. ఈసందర్బంగా వైద్యులు, సిబ్బంది 475 మందికి సాధారణ పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. పేదలు నివాసం ఉండే మైసమ్మగుట్ట కాలనీలో ఉదయం నుంచే వైద్య పరీక్షల కోసం బారులు తీరారు. శిబిరంలో పేర్లు నమోదు చేసుకున్న వారికి 50 శాతం రాయితీపై ఆరోగ్య కార్డులను అందజేశారు. నీలిమ ఆసుపత్రిలో నీలిమ 9 పేరుతో గర్భిణీలకు ఉచిత సేవలు అందిస్తారని, 50 శాతం రాయితీ కార్డులను వినియోగించుకొని నీలిమ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని నిమ్స్ ఏఓ నాగేశ్ సూచించారు. ఈకార్యక్రమంలో నీలిమ ఆసుపత్రి ఏఓ నాగేశ్, క్యాంపు ఇంచార్జ్ ఎల్ల భరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోతబత్తిని స్టీవెన్, మాజీ కౌన్సిలర్ బండారి అంజనేయులుగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కరణం కీర్తిని అభినందించిన మాజీ మంత్రి

**మోమిన్‌పేట్, జనవరి 18, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మోమిన్‌పేట మండలం కోల్కుంద గ్రామ సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ ను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అభినందించారు. ఆదివారం ఆమె నివాసంలో కరణం కీర్తి రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా కరణం కీర్తి రామకృష్ణ ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యావంతురాలైన ఆమె గ్రామాభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని అన్ని రంగాల్లో ప్రగతి సాధించేలా కృషి చేయాలని సూచించారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఇతర గ్రామాలకు ఆదర్శం కావాలని,అలాగే రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రజాసేవలో మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆమె సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు.



కరణం కీర్తి రామకృష్ణ ను అభినందిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

# క్రీడలతో పాటు చదువులోను రాణించాలి

**దుద్యాల్, జనవరి 18, ప్రభాతవార్త :** యువకులు క్రీడలతో పాటు చదువులో ు రాణించాలని రాథోడ్ ఐఏఎస్ అకాడమీ నిర్వహకుడు సీతారాం నాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గౌరారం తండాలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికల ు అందించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, యువకులకు క్రీడలు అంటే చాలా ఇష్టం. వాటిపై అధికంగా దృష్టి సారించి చదువు ు నిర్లక్ష్యం చేస్తున్నారని, అలా కాకుండా క్రీడలు, చదువు రెండింటిలో ను రాణించి ము నుముందు ఏదో ఒక రంగంలో స్థిరపడాలని సూచించారు. జిల్లా స్థాయి క్రీడల ు నిర్వహించిన సాగరం తండా సర్పంచ్ నరేశ్ రాదోడ్‌ను అభినందించారు. ఎంతో కష్టపడి ఇంత పెద్ద టౌర్నమెంట్ నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య, సాగారం తండా సర్పంచ్ నరేశ్ రాథోడ్ లు మాట్లాడుతూ క్రీడల వల్ల దేహ దారుఢ్యం, ఉల్లాసం, ఉత్సహం పెరుగుతుందని గుర్తు చేశారు. ఒక వయస్సు వచ్చిన తర్వాత ఉద్యోగాల్లో స్థిర పడాలని సూచించారు. ఆనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకుడు. దేవిదాస్,



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీతారాం నాయక్

నాయకులు సేవ్యా నాయక్, గోపాల్, లక్ష్మణ్, రెడ్యా నాయక్, రాంజీ నాయక్. పాండ్యా నాయక్, బాల్య నాయర్, చందర్ నాయక్, కిషన్ నాయక్, ఇరు జట్ల కెప్టె ్ల లాల్యా నాయక్, దేవిదాస్ క్రీడకారులు కిషన్, తుల్స్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## ఎస్ఐ రమేష్

**కుల్కచర్ల,జనవరి 18 ప్రభాతవార్త:** యువత మత్తు పదార్థాలకు బానిసలై,భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని, మాదక ద్రవ్యాత రహిత సమాజంగా నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్ఐ రమేష్ కుమార్,జెసిఐ వ్యవస్థపక అధ్యక్షుడు చేదురుపల్లి శ్రీనివాస్ అన్నారు.ఆదివారం మండల కేంద్రంలోని జెసిఐ ఆధ్వర్యంలో యువతకు మాదకద్రవ్యాలు, గంజాయి వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ..యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల లాంటి చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోని లక్ష సాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు.మత్తు పదార్థాలైన గంజాయి,





మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్ కుమార్

డ్రగ్స్ వంటివి తీసుకుంటే ఆరోగ్యంపై పడే హనికర ప్రభావాలతో పాటు ఆర్థికనష్టాలు, సమాజంలో గుర్తింపు, గౌరవం ఉండదని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు విఠల్, శ్రీనివాస్, శరత్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి బాలల నాటిక పోటీలకు ఎంపిక

**షాద్‌నగర్, జనవరి 18, ప్రభాతవార్త :** పాఠశాలలో మొదలై.. పల్లె సీమను అలరించి.. జిల్లా స్థాయికి చేరుకొని.. అక్కడ పురస్కారాలు అందుకొని.. రాష్ట్రస్థాయికి వెళ్లి.. నంది పురస్కారాన్ని చేజిక్కించుకొని.. ఇప్పుడు జాతీయస్థాయికి చేరుకుంది.. ఓ ఉపాధ్యాయుడి అత్యున్నత దర్శక ప్రతిభ.. చిన్నారుల అద్భుతమైన అభినయం.. విపరీతంగా ఆకట్టుకుంటూ విజయవంతంగా ముందుకు సాగుతోంది. సంస్కార భారతి సాంస్కృతిక ప్రస్థానానికి హారతి పడుతోంది. ఆ నాటిక పేరు మాకు స్వతంత్రం కావాలి.. అవును గతంలో ఎంతో పేరు తెచ్చుకొని నంది పురస్కారాన్ని సైతం అందుకున్న ఈనాటిక ప్రస్తుతం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటిక పోటీలకు ఎంపికైంది. ఈనెల 18 నుంచి వచ్చే నెల మూడో తేదీ వరకు జరిగే ఈ నాటక పోటీల్లో ఈనెల 23వ తేదీన సత్యసాయి హై స్కూల్ కు చెందిన బాలికలు పాల్గొంటున్నారు. తెలుగు రాష్ట్రాలలో దాదాపు 75 నాటకాలను పరిశీలించి 17 నాటికలను ఎంపిక చేయడం జరిగిందని, అందులో తమ నాటిక కూడా ఉండడం సంతోషాన్ని ఇచ్చిందని విశ్రాంత ఉపాధ్యాయుడు, ఈ ఈనాటికకు దర్శకుడు టీవీ రంగయ్య తెలిపారు. ఈనాటికను ఇటీవల కూడా తాడేపల్లిగూడెం, హైదరాబాద్ లోని శిల్పారామం, కూకట్ పల్లి,మహబూబ్ నగర్, కర్నూలు ప్రాంతాలలో ప్రదర్శించి కళా ప్రముఖుల ప్రశంశలు అందుకున్నామని వివరించారు. పలు





చిన్నారులతో సంస్కార భారతి సభ్యులు

రాష్ట్రాలలో ఇప్పటికే ఈ నాటకం ఎంపికై పురస్కారాలు అందుకుందని వెల్లడించారు. చిన్నారి కళాకారులు పి. వర్షిణి, సి. యశ్విత, యోషిత, వైష్ణవి, వేద, శ్రీ సింధు, బిందు, స్వచిత్ర ఈనాటికలో ప్రధాన పాత్రధారులని ఆయన వెల్లడించారు. చిన్నారులకు అభినందనలు.. మాకు స్వతంత్రం కావాలి నాటిక ద్వారా జాతీయ స్థాయికి ఎంపికైన చిన్నారులను స్థానిక సత్య సాయి స్కూల్ స్టాఫ్ నాగలింగం, సుధాకర్, సంస్కార భారతి అధ్యక్షుడు శృంగారం శ్రీనివాస్, రంగనాథం, ప్రధాన కార్యదర్శి రవీందర్, శివశ్రీ దాస సత్యనారాయణ, మల్లికార్జున గౌడ, రమేష్, ఎమ్మెస్ ఆర్కే మూర్తి, ఎంవి నారాయణ, బెజుగం రమేష్ తదితరులు అభినందనలు తెలిపారు. చిన్నారులు జాతీయ స్థాయిలోనూ పురస్కారాన్ని పొంది విజేతలుగా తిరిగి రావాలని ఆశీస్సులు అందిస్తున్నట్లు వారు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా పని చేయాలి

## మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

**మేడ్చల్, జనవరి 18, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఎల్లంపేట మున్సిపల్ బిజెపి కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం ఎల్లంపేటలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ ఈ సందర్బంగా మాట్లాడుతూ దేశంలో పేదల అభ్యున్నతికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పనులను రాష్ట్ర ప్రభుత్వం తను చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి బిజేపీని గద్దెనెక్కించేందుకు నాయకులు, కార్యకర్తలు కొత్త, పాత అని తారతమ్యం లేకుండా ఇప్పటి నుండే ప్రణాళిక బద్దంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, సీనియర్ నాయకులు సామ రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నందారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షురాలు జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, జగన్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు పోచయ్య, శ్రీనాథ్‌రెడ్డి, సత్యనారాయణ, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌దాస్, మహేష్, నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, పుష్పరెడ్డి, విశ్వశాంతి కొండల్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంజనేయులు, దేవేందర్‌రెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు తెరకు దేవుడు.. జనం మెచ్చిన నాయకుడు

**ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**
**కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదానం**
**సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన**



ఎన్టీ రామారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

**షాద్‌నగర్, జనవరి 18, ప్రభాతవార్త :** తెలుగు ప్రజలకు దేవుడు ఎలా ఉంటాడో తెలియదు.. కానీ తెలుగు తెరకు నిజమైన దేవుడు వారి దృష్టిలో ఒక్క ఎన్టీ రామారావు మాత్రమే.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు.. రాజకీయ నాయకుడుగా కూడా జనం మెచ్చిన అద్భుతమైన నేత ఎన్టీఆర్ అని ప్రశంసించారు.. పట్టణ శివారులోని బివి రావు నగర్ లో కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్టీ రామారావు వర్ధంతి వేడుకలలో భాగంగా ఆయనకు నివాళులు అర్పించడంతోపాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సినీతెరపై ఎలాంటి పాత్రలోనైనా ఇమిడిపోయే అద్భుతమైన నటుడు ఎన్టీ రామారావు అని కొనియాడారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు, పట్టుదల, క్రమశిక్షణ, నిజాయితీ నేటికీ నేతలకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఆయన చేసిన ఎన్నో కార్యక్రమాల వల్లనే బలహీనవర్గాలు ఈరోజు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ప్రశంసించారు. బీసీల రాజకీయ సామాజిక ఎదుగుదల ఆయనతో పాటే మొదలైందని అన్నారు.

**సిసి రోడ్డు ప్రారంభం..**

పట్టణ పరిధిలోని బివి రావు నగర్‌లో సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ పౌల్ట్రీ ఫారాల ద్వారా ఉపాధి పొందుతున్న ఇక్కడి రైతులకు ఎప్పుడు ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ అగునూరు విశ్వం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, చేగోరి రాఘవేందర్ రెడ్డి, అందెమోహన్, బాలరాజ్, కృష్ణారెడ్డి, గడ్డమీద రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**యువకుల రక్తదానం..**

ఎన్టీ రామారావు వర్ధంతి పురస్కరించుకొని కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా 35 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానం అంటే మనిషికి ప్రాణం పోయడమేనని, ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన కమ్మ సేవాసమితి సభ్యులు అభినందనీయులని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. కమ్మ సమైక్యవేదిక అధ్యక్షులు మనవ సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి మాకినేని వెంకటనారాయణ, కోశాధికారి కాప్రా వెంకటేశ్వరరావు, మదమంచి ఆనందరావు, కాపారామారావు, వైకుంఠ సాంబశివరావు, పాములపాటి మల్లికార్జునరావు, మక్కపాటి మల్లేశ్వరరావు, సింగారావు, కాటూరి సీతారామారావు, కిలారు కుప్పు స్వామి, ధనాల బాలయ్య చౌదరి, అమర్నాథ్, బండ్ల శివ నాగమల్లేశ్వరరావు, నువ్వుల శ్రీనివాసరావు, నంబూరి ప్రసాద్, మండవ విజయ్, హనుమంతరావు, కూకట్ల శివ నాగేశ్వరరావు, బండారి సతీష్, మండవ వెంకటరమణ, నాగరాజు, వైకుంఠ మధు, కోపా కోటేశ్వరరావు, ఈదర సత్యనారాయణ, వైకుంఠ శరత్ బాబు, బ్రమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో ఎన్‌టిఆర్‌కు నివాళులు అర్పిస్తున్న టిడిపి నాయకులు

# ఎన్.టి.రామారావు 30వ వర్ధంతి..నేతల నివాళి

**ఘట్‌కేసర్, జనవరి 18, ప్రభాతవార్త:** తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్‌టి.రామారావు అని ఘట్‌కేసర్ మాజీ టిడిపి అధ్యక్షులు వేముల సంజీవగౌడ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి-తెలుగుదేశపార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్‌చౌరస్తాలోని టిడిపి జెండాదిమ్మె వద్ద మాజీ పార్టీ అధ్యక్షులు సంజీవగౌడ్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పతాకావిష్కరణ చేసిన సంజీవగౌడ్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకొని వచ్చిన రామారావు తెలుగుజాతి అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయని కొనియాడారు. 1982 సంవత్సరంలో తెలుగుదేశంపార్టీని స్థాపించి 1983 నుంచి 1995 మధ్య మూడు సార్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి పేదల సంక్షేమం కోసం కృషిచేశారని గుర్తు చేశారు. రూ.2 లకే కిలో బియ్యం, ఎంసెట్ అమలు, పటేల్‌పట్వారీ వ్యవస్థ రద్దు, పాఠశాలలో మధ్యాహ్నభోజనం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, పేదలకు 5 లక్షల ఇండ్ల నిర్మాణం, జనతావస్త్రాలు తదితర సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత నందమూరికే దక్కుతుందన్నారు. అనంతరం ఎదులాబాద్, మర్రిపల్లిగూడలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో పోచారం మాజీ టిడిపి అధ్యక్షులు సామల జగన్మోహన్‌రెడ్డి, వేణుగోపాలరావు, పాటి సురేందర్‌రెడ్డి, మద్ది రాముగౌడ్, శ్రీనివాస్, అంధోల్ శ్రీనివాస్, మాచర్ల పాండు, సత్యనారాయణ, భూమయ్య, నర్సింగ్‌రావు, మహేశ్, జనార్దన్, అశోక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



హస్నాబాద్‌లో వేప చెట్టుకు కల్లు కారుతున్న దృశ్యం

# సర్వ రోగ నివారిణి వేప చెట్టుకు కారుతున్న వేప కల్లు

**దుద్యాల్, జనవరి 18, ప్రభాతవార్త :** ఈత కల్లు, తాటి కల్లు ను మనం మాములుగా చూస్తూనే ఉంటాము. కానీ వేప కల్లు మాత్రం అరుదుగా చూస్తుంటాము. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలోని చావుడి ఆవరణంలో ఉన్న దాదాపు 100 ఏళ్ల వేప చెట్టుకు వేప కల్లు జోరుగా కారుతుంది. రోజుకు దాదాపుగా 3 లీటర్ల వరకు కారుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈత కల్లు, తాటి కల్లు కంటే వేప కల్లు చాలా మంచిదని, సర్వరోగ నివారిని అని చెబుతున్నారు. వేప కల్లులో చేదు స్వభావం ఉంటుంది కావున ఆరోగ్యానికి ఎంతో అవసరంగా భావిస్తారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారు నిత్యం బాటిల్లు కట్టి మరి వేప కల్లు ను పట్టుకుంటున్నారు. పరిగడుపున తాగితే అనారోగ్య సమస్యలు దూరమవుతాయని పలువురు చెబుతున్నారు. దీంతో నిత్యం కల్లు కోసం పోటీ పడుతున్నారు. ఒకే చెట్టుకు నాలుగు స్థానాల్లో కల్లు కారుతుండడం విశేషం.

# రాజకీయంగా యాదవులను ప్రోత్సహించాలి

**రాజ్యసభ సభ్యుడు, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ లు కలిసిన యాదవ సంఘం నాయకులు..**

**దుద్యాల్, జనవరి 18, ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, సికింద్రబాద్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌ల ను జిల్లా యాదవ సంఘం సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో యాదవ సంఘాలు ఏర్పాటు చేయడంతో పాటు వారి అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాల ు చర్చించారు. రాజకీయంగా యాదవుల ు ప్రోత్సహించాలని సూచించినట్లు జిల్లా నాయకులు చెప్పారు. వారిని కలిసిన వారిలో యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు బేరి రాంచందర్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య, ఉపాధ్యక్షుడు పుర్ర రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, దౌలాపూర్ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ లు ఉన్నారు.



అనిల్‌కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మండల యాదవ సంఘం నాయకులు

# ఖమ్మం సభకు తరలిన సిపిఐ నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ,జనవరి 18,(ప్రభాతవార్త):** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో నిర్వహించిన బహిరంగ సభకు మండల సిపిఐ నాయకులు ఆదివారం తరలి వెల్లారు. ఈ బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య ఆధ్వర్యంలో జిల్లేడు చౌదరిగుడా మండలం నుంచి 50 మంది కార్యకర్తలు బస్సులో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ సిపిఐ పార్టీ 1925 లో డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ కాన్పూర్ పట్టణంలో ఆవిర్భవించిందని తెలిపారు. బ్రిటిష్ కాలంలో సంపూర్ణ స్వసంత్రం కోసం అనేక రకమైన ఉద్యమాలు నడిపింది సిపిఐ అని అన్నారు. స్వతంత్రం తర్వాత దున్నేవాడికి భూమి కావాలని తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపి పది లక్షల ఎకరాలు పంపించేసిందని సిపిఐ అన్నారు. తెలంగాణ నవాబు మెడలు వంచి జాగిర్దాలకు జమీందారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం నడిపి 4500 మంది నాయకులు కార్యకర్తలు సాయిధ పోరాటంలో అమరులయ్యారని అన్నారు. ప్రజల కోసం అనేక రకమైన చట్టాలను తీసుకొచ్చిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐదని ఆయన తెలిపారు. ఇలాంటి చరిత్ర కలిగిన పార్టీలో పనిచేయడం అనేది చాలా గర్వకారణమని అన్నారు. ఈ బహిరంగ సభకు విధేశీయ ప్రతినిధులతో పాటు జాతీయ నాయకత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశవ్యాప్తంగా సిపిఐ నాయకులు కార్యకర్తలు ప్రజలు అభిమానులు ఐదు లక్షల వరకు హాజరైతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు సిపిఐ మండల కార్యదర్శి బాగళ్ల నరసింహ, సహాయ కార్యదర్శి సి సురేష్, జిల్లేడు చౌదరిగుడా మండల సహాయ కార్యదర్శిలు బాలరాజ్, ఎండి షబ్బీర్, భీమయ్య, వి రాములు, వీరేష్,జి యాదయ్య ,ఎం జంగయ్య, లింగమయ్య, అనంత, మంజుల, లక్ష్మమ్మ, నర్సమ్మ, భూపాల్ పాల్గొన్నారు.





మేడ్చల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అభిమానులు

# ఎన్టీఆర్‌కు ఘన నివాళి

**మేడ్చల్, జనవరి 18: ప్రభాతవార్త :** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారక రామారావు వర్ధంతిని మేడ్చల్‌లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శేఖర్ చౌదరి, వాసు వర్మ, సుధాకర్‌గౌడ్, భాస్కర్, బాలకృష్ణ, మౌలానా, బాలకిషన్, వెంకట్రావు, రాంబాబు, శ్రీపాద్ గౌడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## మోని అమావాస్య సందర్భంగా మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

**అమ్మవారి చల్లని చూపులు ప్రజలు అందరిపై ఉండాలి**

**సర్పంచ్ బుజ్జం సంతోషా శ్రీశైలం యాదవ్..**

**కేశంపేట, జనవరి 18, ప్రభాతవార్త:** ఆ అమ్మవారి చల్లని చూపులు ప్రజల అందరిపై ఉండాలని కేశంపేట సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్ ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష శ్రీశైలం యాదవులు మాట్లాడుతూ గ్రామంలో పాడి పంటలు, పశుసంపద సమృద్ధిగా పండాలని అమ్మవారి చూపులు గ్రామ ప్రజలందరిపై ఉంటూ గ్రామస్తులు ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వార్డు సభ్యులు ,మంచే కృష్ణయ్య ,గంజాయి దశరథం, పులిమామిడి నగేష్ ,తిమ్మగల రామచంద్రి, బిజెపి యువ నాయకులు తలసాని పవన్ కుమార్ రెడ్డి ,పిల్లి అమరేష్ యాదవ్, కడియాల అంజయ్య ,శేఖర్ ,రాజు మహేష్ ,యాదయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వాహన చలాన్ కోసం పర్సనల్ అకౌంట్‌ని అటాచ్ చేయడం సరికాదు

### కరెడ్ల నరేందర్ రెడ్డి

**కేశంపేట, జనవరి 18, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలపైనే అధిక భారం మోపుతోందని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా సాంస్కృతిక శాఖ నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రైవసీ అకౌంట్లను ఆర్టీఏకు అప్పజెప్పడం ఏ మాత్రం సరి కాదని అన్నారు. ముందు రైతు బంధు రైతుల అకౌంట్లోకి అనుసంధానం చేయాలని అన్నారు, రైతులను మభ్యపెట్టి రైతుబంధు ఇప్పటికీ ఇయ్యలేని చేతగాని ప్రభుత్వం నడుపుతున్నారని అన్నారు. ఇప్పుడు ప్రజల యొక్క ప్రైవసీని కాలరాశే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు , ప్రభుత్వానికి ప్రజలపై ఏమాత్రం ప్రేమ ఉంటే మీరు ఇచ్చిన హామీలను నెరవేర్చి. ఆడపడుచులకు 2000 ఇస్తున్న హామీలు ఎక్కడ పోయాయి పెన్షన్స్ పెంచుతామన్నారు, ఇచ్చిన హామీలకు ప్రభుత్వ అకౌంట్ ని డైరెక్ట్ గా అటాచ్ చేసి పెన్షన్లను పెంచిచేతగాని వృద్ధులకు మహిళలకు, వితంతువులకు వికలాంగులకు నేరుగా అకౌంట్ లో డబ్బులు వేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## ఇమ్మిడి మహేష్ కురుమకి ఘన సన్మానం



సర్పంచ్ ఉమ్మిడి మహేష్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర కురుమ సంఘం నాయకులు

**తలకొండపల్లి, జనవరి18,ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కురుమ సర్పంచ్‌లకు హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఎగ్గే మల్లేశం భవనంలో సన్మాన కార్యక్రమంలో వెంకట్రావుపేట గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఇమ్మిడి మహేష్ కురుమవెంకట్రావుపేట సర్పంచ్‌గా గెలుపొందారు. ఆదివారం నాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎగ్గే మల్లేశం , హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ గారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చెయ్యడం జరిగింది .ఈ కార్యక్రమంలో కురుమ సంగం రాష్ట్ర నాయకులు గొరిగే వెంకటయ్య ,మాజీ సర్పంచ్ కెంచ హైమావతి రమేష్ గారు, వార్డు మెంబర్ గౌర్ల లింగం ,గ్రామ పెద్దలు ఇమ్మిడి రాములు ,బోడ వెంకటయ్య ,గొరిగే తిరుపత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మృతికి ఆర్థికసాయం



మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

**తలకొండపల్లి, జనవరి18,ప్రభాత వార్త:** రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం, చీపునుంతల గ్రామంలో గుమ్మడి చెన్నమ్మ (80)గతకొంత కాలంగా అనారోగ్యంతోగురై ఆదివారం నాడు మృతిచెందారు. గత కొన్ని రోజులుగా.బాధపడుతూ ఈ రోజు ఉదయం తుదిశ్వాస విడిచారు.. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ రూ.3వేలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి రూ.3వేలు,ఈ మొత్తం రూ.6వేలు అందజేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు... ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్, సెల్ మండల అధ్యక్షులు మిడత చెన్నకేశవులు, మాజీ సర్పంచ్ బండి రఘుపతి,వార్డ్ సభ్యులు వంకరి శ్రీరాములు, గుమ్మడి చెన్నకేశవులు, నాయకులు వెంకటరాజు రెడ్డి, రామచంద్రారెడ్డి, మల్లేష్, మిడత శేఖర్, దాసరి శేఖర్, శ్రీశైలం, చంద్రమోళి , చెన్నయ్య,శివ, వెంకటయ్య , శ్యామలాల్ , తదితరులు పాల్గొన్నారు..

## తలకొండపల్లిలో బి అర్ ఎస్ అధిక స్థానాలలో గెలవటం పట్ల జీర్ణించుకోలేకనే ఆరోపణలు..

**మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి. వెంకటేష్**

**తలకొండపల్లి, జనవరి18,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో ఇటీవల సంభవించిన కొన్ని పరిణామాలు అలుసుగా తీసుకొని కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ఆరోపించారు. రాంపూర్ గ్రామంలో ఎంపీ మల్లు రవి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అనుకొనంత ఏమి జరగలేదని. మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీకి అత్యధిక సీట్లు రావడానికి కారణమే ఈ ఆరోపణనని ఉప్పల వెంకటేష్ అన్నారు. గ్రామాల్లో ఎన్నికల తర్వాత చిన్నచితిగా సంఘటన జరుగుతాయని దాని అలసిగా తీసుకొని ఎంపీ ఎమ్మెల్యే వచ్చి. ఐఏఎస్ ఐపీఎస్ లకు ఫోన్ చేసి బి ఆర్ ఎస్ కార్యకర్తలపై కేసులు బనాయించాలని ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు. నిజానిజాలు గ్రామాలు తీసుకొని మాట్లాడండి ఆయన అన్నారు. టిఆర్ఎస్ నాయకులకు ఇక్కడ అన్యాయం జరిగిన వాళ్ళ వెన్నంటే ఉంటామని వెంకటేష్ అన్నారు.



## ఇరుకు దార్లితో ఇబ్బందులెన్నో – ప్రజా ప్రతినిధులు పట్టించుకోండి

**నందిగామ, జనవరి 18, ప్రభాతవార్త:** నందిగామ పాత జాతీయ రహదారి నుండి అంతిరెడ్డి గూడ వెళ్లే ఇరుకు రహదారితో ఇబ్బందులు పడుతున్నామని ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోని రహదారి విస్తరణ పనులు చేపట్టాలని జంగోని గూడ బిఆర్ఎస్ సీనియర్ నేత జంగ రజనీకాంత్ ఆదివారం డిమాండ్ చేశారు. అస్తవ్యస్తమైన ఇరుకు రహదారిని బాగు చేయాలని చెప్పిన గత ప్రభుత్వ. పాలకులు నిర్లక్ష్యం వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిపై ఒక వాహనం ఎదురుగా వస్తే మరో వాహనం పోలేని రీతిలో తయారయిందని, ఈసారైన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు రహదారి విస్తరణ పనులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.



నందిగామ నుండి అంతిరెడ్డిగూడ వెళ్లే ఇరుకు రహదారి

## ఘనంగా గోదాదేవి అభిషేకం..నోము

**ఘట్‌కేసర్, జనవరి 18, ప్రభాతవార్త:** ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నార్ రంగనాయకస్వామి దేవస్థానంలో గోదాదేవి అభిషేకం–నోము కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాలలో పాశురం పఠనం, నిత్యపూజలు, పుష్కరిణిలో తెప్పోత్సవం, శ్రీగోదారంగనాయకస్వామి కళ్యాణోత్సవం కనులపండువలా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలోని మండపంలో అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య ఆలయ ధర్మకర్తలు అభిషేకం నిర్వహించారు. అనంతరం ధర్మకర్తలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య అమ్మవారి నోము కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ రకాల సుగంధద్రవ్యాలు, పంచామృతంతో అమ్మవారి మూర్తిని అభిషేకం చేశారు. ఈసందర్భంగా మహిళా భక్తులు పాల్గొని అండాల్ అమ్మవారి నోమును భక్తి, శ్రద్దలతో తిలకించారు. అర్చకస్వాములు భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. ఆలయంలో గత నెల రోజులుగా జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు ముగిసాయి. ధనుర్మాస ఉత్సవాలలో పూజాది కార్యక్రమాలు నిర్వహించిన ఋత్వికులకు సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో ధర్మకర్తలు తిరువడందం పొరెత్తి శేషాచార్యులు, పార్థసారథిచార్యులు, పణికుమారాచార్యులు, పవనాచార్యులు పాల్గొన్నారు.



గోదాదేవి అభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్న ధర్మకర్తలు

## నిరుపేదలకు అప్పన్నహస్తం సన్న బియ్యం పథకం

**నందిగామ, జనవరి 18, ప్రభాతవార్త:** మూడు రోజులపాటు జరిగిన సంక్రాంతి పండుగలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరన్న ఆశీస్సులతో సన్న బియ్యంతో మా కుటుంబ సభ్యులం,బంధు మిత్రులతో కలిసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా విందు చేసుకున్నామని..పల్లె జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో ప్రతి నిరుపేదకు సన్న బియ్యంతో పట్టెడన్నం దొరకడం అదృష్టంగా భావిస్తున్నామని పల్లె జనం మురిసిపోతున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఎమ్మెల్యే శంకరన్న పుణ్యమా అని మాకు కొత్త రేషన్ కార్డు వచ్చిందని, కార్డు ఇప్పిచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారికి, సహకరించిన సర్పంచ్ కొమ్ము కృష్ణ కు, అధికారులకు, నందిగామ కాంగ్రెస్ సీనియర్ నేత కేశమోని సాహితి రామచందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



నందిగామలో రేషన్ బియ్యం తీసుకుంటున్న కాంగ్రెస్ నేత రాంచందర్

## ఎదులాబాద్‌లో ఘనంగా 14వ విశ్వశాంతియాగం



విశ్వశాంతియాగంలో పాల్గొన్న కొండల్‌రెడ్డి దంపతులు, శంకరప్ప



అన్నప్రసాద వితరణ చేస్తున్న కొండల్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జనవరి 18, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి పరిధి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి దేవాలయంలో 14వ విశ్వశాంతియాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ యజ్ఞ నిర్వహణకర్త కంట్లం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ప్రతినెల మాసశివరాత్రి రోజును లోకకళ్యాణార్థం విశ్వశాంతియాగం నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలోని విఘ్నవినాయక కళ్యాణ మండపంలో శనివారం మాసశివరాత్రి సందర్భంగా స్వామికి అభిషేక పూజలు చేసి విశ్వశాంతి యజ్ఞం నిర్వహించారు. మండల బిఆర్ఎస్‌పార్టీ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, అనిత దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. అర్చకులు శ్యామ్‌కుమార్, మహేశ్‌కుమార్‌ల మంత్రోచ్చారణాల మధ్య విశ్వశాంతిహోమం జరిపారు. విశ్వశాంతియాగం సందర్భంగా కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో త్వరలో 21 అడుగుల ఎత్తైన శ్రీవీరహనుమాన్ నల్లరాతి విగ్రహ ప్రతిష్టాపన చేయనున్నామని దాతలు సహకరించాలని ధర్మకర్త కంట్లం గౌరీశంకర్ కోరారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి ఎదుగని క్రిష్ణమూర్తి, మాజీ ఎంపిటిసిలు మంకం రవి, నాగులపల్లి రమేశ్, సొసైటీ మాజీ చైర్మన్ దొంకెన బిక్షపతిగౌడ్, ఆర్‌బిఎస్ మాజీ జిల్లా సభ్యులు చిలుగూరు మంకయ్య, మాజీ వార్డుసభ్యులు ఉదారి సత్యనారాయణ, ఎర్రోళ్ల మురళీకృష్ణ, బొడిగె శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కానుగంటి శ్రీనివాస్, కుక్కునూరి రాజశేఖర్, చిరంజీవి, ధర్మకర్తలు ఓంప్రకాష్, నరేశ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

**జిల్లెడు చౌదరిగూడ,జనవరి 18,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో నిర్వహించిన ఆర్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొదటి స్థానంలో రావిర్యాల రెంజర్స్ జట్టు నిలవగా రెండవ స్థానంలో రావిర్యాల రౌడిబాయిస్ జట్టు నిలిచింది. విజేతలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, గ్రామ సర్పంచ్ నీలయ్య, ఉప సర్పంచ్ జంగయ్యలతో పాటు గ్రామ పెద్దలు భహుమతులు ప్రధానం చేశారు. మొదటి భహుమతి రూ.20వేల రూపాయలను సర్పంచ్ నీలయ్య అందజేశారు. అలాగె రెండవ భహుమతి రూ.10వేలను ఉప సర్పంచ్ జంగయ్య అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ క్రిడాకారులు గెలుపు ఓటములను సమానంగ చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, బాల్‌రాజు, వీరన్న, గోపాల్‌రెడ్డి, భాస్కర్, వెంకటయ్య, చంద్రయ్య, మహెందర్, జగన్, శ్రీశైలం, నర్సింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

## వడ్డే ఓబన్న జయంతి..నాయకుల నివాళులు

**-సబండ వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి**

**ఘట్‌కేసర్, జనవరి 18 , ప్రభాతవార్త:** మహనీయుల జీవిత చరిత్రను తెలుసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా సమాజానికి సేవలందించాలని ఉమ్మడి ఘట్‌కేసర్ మండల వడ్డెర యువజన సంఘం అధ్యక్షులు మైగాని సాయికుమార్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 248వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సాయికుమార్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం. అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాయి కుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈసందర్భంగా బ్రిటిష్ వారిని వణికించిన గెరిల్లాయోధుడు వడ్డే ఓబన్న 219వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారత రాజ్యాంగపీఠికపై అందరూ ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు, అంబేద్కర్ సంఘం (ఇడబ్ల్యుఎస్‌కాలనీ) అధ్యక్షులు బండారు రాందాస్, నాయకులు కె.నర్సింగ్‌రావు, కె.సత్యం, కదుపోల్ల బిక్షపతి, కె.మహిపాల్, జి.అంజయ్య, బి.గణేశ్‌గౌడ్, బి.సురేశ్‌గౌడ్, కృష్ణంరాజు, ఇ.విష్ణు, జె.అఖిల్, డి.శివకృష్ణ, లలిత్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులు అర్పించి ప్రమాణం చేస్తున్న సాయికుమార్, అరుణ్‌కుమార్



క్రీడా మైదానంలో యూనిఫామ్‌తో ఉన్న క్రీడాకారులు

## క్రీడాకారులకు డ్రెస్ స్పాన్సర్ చేసిన హర్ష విజయ నాయక్

### అభినందనలు తెలిపిన క్రీడాకారులు

**నందిగామ, జనవరి 18, ప్రభాతవార్త:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో ఉన్న శివకర్ క్రికెట్ మైదానంలో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు డ్రెస్ స్పాన్సర్ చేసిన తాటిగడ్డ తండాకు చెందిన హర్షవిజయ్ నాయక్‌కు క్రీడాకారులు అభినందనలు తెలిపారు. గ్రామీణ యువతను క్రీడలలో ప్రోత్సహిస్తున్న హర్ష విజయ్ నాయక్ సేవల పట్ల జటావత్ సోమ్లా నాయక్ (నాని) కృష్ణ (ఈట),పరుశురాం, రమేష్, గణేష్, ముఖేష్ లు అభినందించిన వారిలో

## రక్తదానంపై యాదిలాల్‌కు భువనేశ్వరి ప్రశంసలు

**ఆమనగల్లు, జనవరి 18, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్, ప్రముఖ న్యాయవాది యాదిలాల్‌పై ఎన్టీఆర్ ట్రస్టు అధినాయకురాలు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరిదేవి ప్రశంసల వర్షం కురిపించారు. గత కొన్ని సంవత్సరాలుగా యాదిలాల్ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదానం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆది వారం జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో స్థానిక టిడిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన రక్తదానంలో పాల్గొని ఈఏడాది కూడా రక్తదానం చేశారు. యాదిలాల్ ఔన్న త్యాన్ని తెలుసుకున్న నారా భువనేశ్వరిదేవి యాదిలాల్‌ను ప్రత్యేకంగా అభినందించినట్లు స్థానిక టిడిపి నాయకులు తెలిపారు. సేవాగుణాన్ని అలవర్చుకోవడం మానవత్వ లక్షణాలకు నిదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు కండె సత్యం, అర్థం నర్సింహ్మా, గాజుల పద్మనాభం, శ్రీనాథ్, పంచాక్షరి, సింహ్మాయ్య తదితరులు పాల్గొన్నారు.



యాదిలాల్‌కు ప్రశంసపత్రం అందజేస్తున్న నారా భువనేశ్వరి

## ఎన్టీఆర్ సేవలు అనుసరణీయం

**ఆమనగల్లు, జనవరి 18, ప్రభాతవార్త:** బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఎన్టీఆర్ చేసిన సేవలు అన్ని తరాలకు అనుసరణీయమని టిడిపి సీనియర్ నాయకులు కండె భాస్కర్, చింతలపల్లి సర్పంచ్ కొప్పు యాదయ్యలు అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి ఎన్టీఆర్ చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు. ఆదివారం ఎన్టీఆర్ వర్ధంతి సంధర్భంగా ఆమనగల్లు టిడిపి శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకుని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటస్వామిగౌడ్, గుండమల్ల జగన్, జంగయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.



ఆమనగల్లులో ఎన్టీఆర్ చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న టిడిపి శ్రేణులు

## మైసమ్మదేవతకు ఎమ్మెల్యే పూజలు

**ఆమనగల్లు( కడ్తాల) జనవరి18, ప్రభాతవార్త:** కడ్తాల మండలం మైసిగండి గ్రామంలోని మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించి మైసమ్మదేవతను దర్శించుకున్నారు. ఆలయంలో ఎమ్మెల్యేకసిరెడ్డి మైసమ్మదేవతకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ ఫౌండం ట్రస్టీ మాజీ ఎంపిపి రామావత్ శిరోలీ మాజీ పిఎసిఎస్ చైర్మన్, టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస గౌడ్‌తో కలిసి ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదినం కావడంతో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి అమ్మవారిని దర్శించు కున్నారు. ఈమేరకు శిరోలి, శ్రీనివాస్ గౌడ్‌లు కసిరెడ్డిని శాలువాతో సన్మా నించి శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఠాకూర్‌బాలాజీసింగ్, గూడూరు భాస్కర్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, బిక్యానాయక్, బిచ్యానాయక్, జ్యోతినాయక్, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



మైసిగండిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



గృహజ్యోతి లబ్దిదారులకు పత్రాలు అందజేస్తున్న సర్పంచ్

## గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ గడ్డం వెంకటయ్య

**కుల్కచర్ల,జనవరి 18 ప్రభాతవార్త:** గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకొవాలని సర్పంచ్ గడ్డం వెంకటయ్య అన్నారు. అదివారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామ పంచాయతీకార్యాయలంలో గృహజ్యోతి లబ్దిదారులకు పత్రాలు అందజేశారు.ఈ సందర్బంగా సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడతూ...గత బిఆర్ఎస్ ప్రభుత్వనికి ధనిక రాష్ట్రాన్ని అప్పులకుంపటిలోకి నెట్టారని, పది సంవత్సరాల పాలనలో ఒక్క రేషన్ కార్డు, ఇండ్లు లేని పేదలకు ఇల్లు ఇవ్వలేదని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంత్సరాల పాలనో రైతులకు 2 లక్షల రుణ మాఫి, సాగు నీటి కాల్వల అభివృద్ధి, రేషన్ కార్డు,ఇందిరమ్మ ఇండ్లు, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్న బియ్యం, పంపిణి,మహిళలకు ఉచిత బస్సు పథకాలు ప్రవేశ పెట్టి అమలుచేస్తుందని అన్నారు. పరిగి నియోజకవర్గ అభివృద్దికి ప్రత్యేక నిధులు తెచ్చి గ్రామాల అభివృద్దికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంత మొగులయ్య,సినియర్ నాయకులు మురళికృష్ణ,ఫిల్డ్‌అసిస్టెంట్ వెంకటయ్య,అనంతయ్య, వెంకటయ్య విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించిన సర్పంచ్

**తలకొండపల్లి, జనవరి18,ప్రభాత వార్త:** తలకొండ పల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలోని తిక్కల వెంకటయ్య గత 3 రోజుల క్రితం హార్ట్ స్ట్రోక్ తో కల్వకుర్తి సత్యనారాయణ హాస్పిటల్లో జాయిన్ అవ్వడం జరిగింది. అయితే వారు హైదరాబాద్ ప్రాగ్మా హాస్పిటల్‌లో సర్జరీ చేయాలని పంపగా నిన్న తిక్కల వెంకటయ్యకి సర్జరీ కావడం జరిగింది. ఈ విషయం రాంపూర్ గ్రామ సర్పంచి వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ తెలుసుకొని గ్రామ నాయకులతో కలిసి వారిని హాస్పిటల్లో పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి త్వరగా కోలుకునే విధంగా డాక్టర్స్ ని అడిగి తెలుసుకోవడం జరిగింది మరియు వారి సొంతంగా ఆర్థిక అవసరాల కోసం 5000/ రూపాయలు తక్షణ సాయం చేయడం జరిగింది. మరియు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్న నేను ముందుండి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తానని వారి కుటుంబ సభ్యులు తిక్కల యాదమ్మ, మహేష్, శివకి హామీ ఇవ్వడం జరిగింది...

ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ మాజీ సర్పంచ్ దీ యాదయ్య , నాయకులు మొక్తాల రాఘవేందర్ గౌడ్ , మాజీ వార్డు సభ్యులు మీసాల ఆంజనేయులు , యువ నాయకులు సప్పిడి పాండు , రొయ్యల మహేష్ గారు, హరికృష్ణ , తదితరులు పాల్గొన్నారు.



హాస్పిటల్లో పరామర్శిస్తున్న సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్